# అవధాన పుష్కరిణి

అంతర్జాల మాసపత్రిక

సంపుటి: 1 సంచిక: 9 పరాభవ - అధికజ్యేష్ఠ శుద్ధ విదియ, 18 మే 2026



## వేలూరి శివరామశాస్త్రి


(1892 - 1967)

శా॥ బంధంబుం బురుడించు నాప్రణయకోపస్ఫూర్తివేళం బున
స్సంధానంబగు నా ప్రసాదగరిమల్ సాధించు వేళం గడున్
బంధూకాధరచంద్రమావదనయౌ భామాస్య మందౌర కా
మాంధుం డర్ధనిశీధియందుఁ గనె నయ్యర్కేందు బింబంబులన్

ప్రచురణ
అవధాన విద్యా వికాస పరిషత్
భాగ్యనగరం

అవధాన విద్యా విజయతే తరామ్





అవధాన విద్యా వికాస పరిషత్ 2026 మే 18వ తేదీ నుంచి 24వరకు నిర్వహిస్తున్న
ఐదవ వార్షిక అవధాన, పద్య శిక్షణా శిబిరం గోడ పత్రిక, ఆహ్వాన పత్రికలను
13.05.2026న ఆవిష్కరిస్తున్న మహా సహస్రావధాని, పద్మశ్రీ పురస్కృతులు
బ్రహ్మశ్రీ గరికిపాటి నరసింహారావు గారు

# అవధాన పుష్కరిణి

సంపుటి - 1 | అంతర్జాల మాస పత్రిక | సంచిక - 9

పరాభవ - అధికజ్యేష్ఠం 2026 18-05-2026 ప్రచురణ: అవధాన విద్యా వికాస పరిషత్

శ్రీయుతమై రసైకలహరీసితమై, వివిధావధాన వి
ద్యాయతధీకవీశ్వరులు తామరలై విరియన్ - తదీయ వి
జ్ఞేయ సుపద్యమాధురు లశేషబుధాళుల కిందు విందుగా
నీ యవధాన పుష్కరిణి - ఈప్సితమై వెలుగొందు నందమై

- డా. జి.యం.రామశర్మ, శతావధాని

## సంపాదక వర్గం

**ప్రధాన సంపాదకులు**
మరుమాముల దత్తాత్రేయశర్మ

**సహసంపాదకులు**
కె.వి.ఎన్. ఆచార్య
కౌండిన్య తిలక్

**గౌరవ సలహాదారులు**
నారుమంచి వేంకట అనంతకృష్ణ శర్మ
మరుమాముల వేంకటరమణశర్మ
కంది శంకరయ్య

**సంపాదకవర్గం**
డా॥ జి.యం.రామశర్మ
ఆముదాల మురళి
డా॥ సంగనభట్ల నరసయ్య
మారేపల్లి వేంకట పట్వర్ధన్
ఆచార్య ఫణీంద్ర
చిటితోటి విజయకుమార్
చింతా రామకృష్ణారావు

**రూపకల్పన:** పంతుల విట్టుబాబు
**అక్షరాలంకరణ:** విరివెంటి సాహితీసుధ

**కార్యాలయం**
శ్రీరామ సదనం, 29-1499/6/1,
వెస్ట్ కాకతీయ నగర్, రోడ్ నం.1,
నేరేడుమెట్టు, సికిందరాబాద్ - 500 056
ఫోన్: 9441039146

అవధాన విద్యా వికాస పరిషత్ సేవాకార్యక్రమాలకు ఆర్థికంగా సహకరించదలచిన సహృదయులు ఫోన్ పే ద్వారా స్పందించగలరు.

అవధానవిద్యా విజయతే తరామ్

## సంపాదకీయం

### నిష్ఠ

ఆధ్యాత్మికత లేని సైన్స్ (శాస్త్రం) మానవమనుగడను దెబ్బ తీస్తుంది. అలాగే ఆధ్యాత్మిక సంస్పర్శలేని ఏవిద్య యైనా వ్యర్థమేఅవుతుంది. ఈ రెండింటిని సమతుల్యంగా నిర్వహించి అద్భుతాలు ఆవిష్కరించారు మన భారతీయ వైదిక ఋషులు. ప్రకృతిని విధ్వంసం చేయకుండా ప్రకృతి తత్త్వాన్ని అధ్యయనం చేసి గొప్ప ఫలితాలు రాబట్టారు. జ్ఞానమార్గంలో తపస్సిద్ధులకు వేదరూపమైన విజ్ఞానం దర్శనమిచ్చింది. ఆ జ్ఞానాన్ని శ్రుతులరూపంలో పదిలపరుచుకొని అంతేవాసులకు అందించారు. శ్రుతి స్మృతిగా రక్షింపబడింది.

మేధామథనంగా వాగ్రూప విజ్ఞానాన్ని తరతరాలకు అందించిన / అందిస్తున్న ఘనత మన వేదర్షులదే. ధారణలో వాఙ్మయాన్ని నిలుపుకోవడం, దాన్ని పదిలంగా భావితరాలకందించడం అక్షర పరబ్రహ్మోపాసనగా మన పూర్వికులు నిష్ఠగా నిర్వహించారు.

ఈ నిష్ఠ సామాన్యీకరణమై అన్ని వృత్తులవారికీ అనుసరణీయమైంది. సకల వృత్తులలో సమస్తజాతులలో వెల్లివిరిసిన కళా కౌశలాలకు ధారణాప్రధానమైన నిష్ఠయే మూలకారణం.

భాషావిషయకంగా తొలుత సంస్కృతంలో పిదప తెలుగులో అవధాన రూపంలో అక్షర పరబ్రహ్మార్చన జరిగింది. ఆశువుగా శ్లోకాలరూపంలో వెలిసిన స్తోత్ర వాఙ్మయం, తెలుగు పద్యాలలో పరిమళించిన ఆశుగ అవధాన పద్య విన్యాసం ఇదే. వేదాధ్యయనంలో ఘన జటాది రూపంలో ఎలా స్మృతిగా నిలుపుకునేవారో వివరించే వ్యాసం ఈ సంచికలో ఉన్నది. ఛాత్రావధానులు పరిశీలించదగిన ఇలాంటి విశేషాలు మరెన్నో ఇకముందు ప్రకటితమౌతాయి.

ఇక, మన విషయానికొస్తే అవధాన విద్యావికాస పరిషత్ ఐదవ అవధాన పద్య శిక్షణ శిబిరాన్ని నిర్వహించుకొంటుంది. ఈకృషి భావితరాలకు ఆదర్శం కావాలని ఆశిస్తూ, మాకు ఇతోధికంగా సహకారాన్నందిస్తున్న పద్యవిద్యాభిమానులందరికీ హృదయపూర్వక నమస్సుమాంజలులందజేస్తున్నాము

# సంస్తుతి



## చదువులమ్మ స్తుతి

డా. గరికిపాటి నరసింహారావు

సీ. ఆ చీర అంచులో ఏచోయవాయావ*
సంధిలక్షణములు బంధితములు
ఆ నవ్వు వెల్గులో హంసవర్ణసవర్ణ
దీర్ఘ సంధిత్వమ్ము దీప్తమగును
ఆ కుంతలమ్ములో ఐఔల మెలికలో
వృద్ధి సంధి రసప్రవృద్ధమగును
ఆ నమద్గళములో మా నమస్కృతులలో
అనునాసికమ్ములు అరయనగును

తే.గీ. సంధి కవకాశమేలేక సమరమైన
జీవితమ్మున గెలువ నిన్ జేరియుంటి
సంధులను మాలగాగొని సాకుమమ్మ
సంధిప్రేలాపనముగాదు చదువులమ్మ!

**భావము:**

*ఏచోయవాయావ – అష్టాధ్యాయి. సంధిపరిచ్ఛేదం 6.1.78

ఏ, ఓ, ఐ, ఔ లకు అచ్చుపరమైనపుడు క్రమంగా అయ్, అవ్, ఆయ్, ఆవ్ – అనునవి ఆదేశములుగా వస్తాయి. ఇది వ్యాకరణనియమం.

ఏ, ఐ, ఓ, ఔ లకు అయ్, ఆయ్, అవ్, ఆవ్ వస్తాయి అనేటపుడు ఒకటి హ్రస్వము, ఒకటిదీర్ఘమూ, మరల హ్రస్వము, దీర్ఘము వస్తాయి గదా.

సరస్వతీ దేవి చీర కుచ్చుల మడతలలో ఒకటి చిన్నది ఒకటి పెద్దది, ఒకటి చిన్నది, ఆపైన మరలా పెద్దదీ అలా ఏచోయవాయావలులా ఉన్నాయని భావన.

## ఇదీ క్రమణిక

1. కావ్యాస్వాదన ... ... ... ... ... ... ... ... . 3
2. అంశావలోకనం ... ... ... ... ... ... ... .. 4
3. విశిష్ట తెలుగు భాషా వైభవం... ... ... ... .. 5
4. వేదాల్లో ఘనపాఠం, తెలుగుసాహిత్యంలో అవధానం 6
5. పద్యపరీమళం ... ... ... ... ... ... 9,22,23
6. వ్యాకరణ వరివస్య ... ... ... ... ... ... .. 10
7. నిఘంటుపరిజ్ఞానం... ... ... ... ... ... ... 11
8. 'అవధాని'గా తొలి తెలుగు ప్రధాని!.. ... ... . 12
9. అవధానవేదిక ... ... ... ... ... ... ... ... 14
10. పూరణతోరణం ... ... ... ... ... ... ... .. 16
11. పద్యకవిత్వము సాధుప్రయోగాలు ... ... ... 17
12. కావ్యశాస్త్రగవేషణ ... ... ... ... ... ... ... 18
13. ఖండశర్కర ... ... ... ... ... ... ... ... . 20
14. ప్రహేళికా ... ... ... ... ... ... ... ... ... 21
15. సంస్కృతం సంస్కృతి ... ... ... ... ... .. 24

## సుహృద్వాణి

సంచికలో అమూల్యమైన విషయాలున్నాయండి. ధన్యవాదాలు.

**– కంజర్ల రామాచార్య, కోరుట్ల**

మంచి పుష్టికర వ్యాసపూర్ణపుష్కరిణి

**– డా. రేవూరి అనంతపద్మనాభరావు**

ప్రతినెలా అద్భుతమైన వ్యాససంపదతో ఆలరారుతూ వస్తున్న 'అవధానపుష్కరిణి' అవధానం చేస్తున్నవారికి, చెయ్యాలని అనుకుంటున్నవారికి దిక్సూచి. పూర్వావధానుల పద్యాలు, కావ్యాలలోని పద్యాల విశ్లేషణ అవధానులకు పద్యనిర్మాణం పైన అవగాహనను పెంచుతుంది. అంతేకాక అవధాన శిక్షణ శిబిరం విజయవంతంగా ఐదవసారి కూడా నిర్వహించడం అపూర్వం. మీ కృషికి అభినందనలు.

**– కె.ఎల్.నరసింహమూర్తి**

**మనవి**

- పత్రికకు వ్యాసాలు, పద్యపూరణలు పంపేవారు యూనికోడ్ లో ఓపెన్ టెక్స్ట్ ఫైల్ రూపంలో మాత్రమే పంపండి.
- PDF , Photo copy రూపంలో పంపినవి స్వీకరించలేము.
- కవులు, రచయితలు తమ పేరు, ఊరు, ఫోన్ నెంబర్ తప్పనిసరిగా వ్రాయండి.
- అవధాన విద్యా వికాస పరిషత్ సమూహంలో కానీ 9441039146 వాట్సాప్‌కు "అవధాన పుష్కరిణిలో ప్రచురణార్థం" అని వ్రాసి మీ రచనలు పంపవచ్చు.

**- సంపాదకులు**

# యయాతి చరిత్ర

## డా. ఆచార్య ఫణీంద్ర

**ఆ రాచవేల్పురాయడు**
**వేరపు బేరెందునైన వినబడకుండం**
**దోరముగ జిల్వరేనికి**
**నూరటగా బుడమి దాల్చి యొకనా డంతన్**

ఈ కంద పద్యం – "పొన్నికంటి తెలగన" కవి రచించిన "యయాతి చరిత్ర" అనే అచ్చ తెనుగు కబ్బంలో – ప్రథమాశ్వాసంలోని 96వ పద్యం. ఇంతకు ముందు చెప్పుకొన్న పద్యంలో యయాతి మహారాజు తన పరిపాలన వైభవంతో సముద్రుని వ్యధను తొలగించినట్లుగా చమత్కరించిన కావ్యకర్త ఈ పద్యంలో ఆదిశేషుని భారాన్ని తగ్గించి, ఊరట కలిగించినట్లుగా వర్ణించారు. ఆ వివరాల లోనికి వెళ్ళే ముందు, ఈ పద్యంలోని కొన్ని విశిష్టమైన అచ్చ తెనుగు పదాలను పరిశీలిద్దాం –

వేల్పురాయడు = దేవతల రాజు అనగా ఇంద్రుడు.

రాచవేల్పురాయడు = రాజేంద్రుడు. (ఇక్కడ యయాతి రాజేంద్రుడు.)

వేరము = వైరం లేక విరోధం

వేరపు పేరు = వైరం అనే మాట లేక విషయం

తోరముగ = బలిష్ఠంగా

చిల్వ = చిలువ = సర్పము

చిల్వరేడు = సర్పరాజు అనగా ఆదిశేషుడు

ఇక, ఈ పద్య భావాన్ని అవగతం చేసుకొందాం. కృతికర్త – "ఆ యయాతి రాజేంద్రుడు వైరమనే మాట సమస్త భూమండలంలో ఎక్కడా వినబడకుండా చేసి, బలిష్ఠంగా మార్చి, ఈ భూమిని మోస్తున్న ఆదిశేషునికి ఊరట కలిగించేలా పరిపాలిస్తూ .." అని వివరించి, "అంతట.. ఒకనాడు.." అంటూ తరువాతి కథా గమనంలోకి వెళ్ళాడు.

ఇక్కడ – వైరమనే మాట సమస్త భూమండలంలో ఎక్కడా వినబడకుండా చేస్తే, ఈ భూమి బలిష్ఠంగా మారడం ఏమిటి? కొంచం వివేచిస్తే – భూమిపై వైరమన్నదే లేకుండా చేస్తే .. యుద్ధాలు, యుద్ధాల వలన కలిగే కష్ట నష్టాలేవీ లేకుండా పోయి, ఈ భూమి బలిష్ఠంగా.. అంటే ఎటువంటి ఆర్థిక నష్టాలు లేకుండా, శాంతి సౌఖ్యాలతో శక్తిమంతంగా మారుతుందని కవి భావన అని మనకు అర్థం అవుతుంది. నర్మగర్భంగా ఈ అభివ్యక్తిలో ఎంతటి అధునాతన శాంతి సందేశాన్ని నిక్షిప్తం చేసాడు మన పొన్నికంటి తెలగన కవి!!




ముఖ్యంగా .. కొంత కాలంగా – ప్రపంచంలోని వివిధ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధాల వలన సమస్త భూమండలం పైనున్న అన్ని దేశాల ప్రజలకు కలుగుతున్న కష్ట నష్టాలను చూస్తుంటే – 16వ శతాబ్దికి చెందిన ఈ కవి ఎంతటి సార్వకాలీనమైన, ఎంతటి సార్వ జనీనమైన సత్యాన్ని సందేశంగా అందించాడో మనకు అవగతమౌతుంది. నిజమే కదా! – వైరం, విద్వేష భావనలు మొత్తానికే లేకపోతే – ఈ భూమండలం అంతా ఒక శాంతి నిలయమై, అత్యంత శక్తిమంతంగా వర్ధిల్లుతుంది. అంతే కాదు.. ఈ ఉపదేశంలో మరొక ఆధునిక సందేశాన్ని కూడ ఇమిడ్చాడు కవి. గురజాడ వారు అన్నట్టు – ఒక దేశం కాని.. భూమి కాని.. అంటే కేవలం మట్టి కాదు, మనుషులు!.. అని ఆ సందేశ సారం. తెలగన కవి ఈ పద్యం ద్వారా – "భూమి శక్తిమంతంగా ఉండడం అంటే .. ఈ భూమిపై ప్రజలు శక్తిమంతంగా ఉండడమే" అని ఆనాడే ప్రవచించాడన్న మాట! ప్రజలంతా శక్తిమంతులై శాంతి సహనాలతో జీవిస్తుంటే, ఇక సమస్యలేవీ లేక భూభారం తగ్గి, దానిని మోస్తున్న ఆదిశేషునికి ఊరట కలిగించేలా ఉంది అన్నది పొన్నికంటి కవి ఈ పద్యంలో పొదిగిన చమత్కారం!

ఏమైనా.. ఇంత చిన్ని పద్యంలో ఇన్ని విశేషాలను నిబిడీకృతం చేయడం – అచ్చ తెనుగులో తొలి ప్రబంధాన్ని వెలయించిన "పొన్నికంటి తెలగన" కవికే చెల్లింది సుమా!

**ప్రకటన**

అవధానకళ భావితరాలకు నిరంతరాయంగా ప్రవహింపజేయడంలో మా వంతు కృషిగా అవధాన విద్యను యువతరానికి బోధించడానికి, **'అవధాన విద్యా వికాస పరిషత్తు'**ను ఏర్పాటు చేసి 2022వ సంవత్సరం నుండి నాలుగేళ్ళుగా 'భాగ్యనగరం'లో ఏడురోజులపాటు **'అవధాన శిక్షణ శిబిరాలను'** నిర్వహిస్తూ వస్తున్నాం. అలాగే ఈ 2026వ సంవత్సరం కూడా **మే 18 నుండి 24 వరకు** శిక్షణ శిబిరం ఏర్పాటు జరుగుతుంది. వేదిక సెయింట్ మార్క్స్ హైస్కూల్, దీనదయాల్ నగర్, నేరేడుమెట్టు, మల్కాజిగిరి, హైదరాబాద్. వివరాలకు 9441039146, 8555082034 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చు.

**- సంపాదకులు**

# డా. ఆశావాదిగారి అవధానాలు నిషిద్ధాక్షరి

# అంశావలోకనం

శతావధాని ఆముదాలమురళి

అవధానంలో నిషిద్ధాక్షరి చాలా క్లిష్టమైన అంశం. పృచ్ఛకుడు పాండిత్యంలో అవధానికి సమస్కంధుడుగా ఉంటాడు. అంశం నిర్దేశింపబడిన తర్వాత పద్యం ప్రారంభించాలి. సర్వసాధారణంగా తెలుగు అవధానాల్లో కందం, సంస్కృతంలో అనుష్టుప్ ఛందస్సులను ఎన్నుకొంటారు. సభ త్వరగా నడవాలన్నది ఆకాంక్ష. బాహాబాహిగా పద్యమల్లడం సాగుతుంది. అవధాని ఊహను పృచ్ఛకుడు పసిగట్టి తరువాత అక్షరాన్ని నిషేధించాలి. అవధానిది ద్విముఖ వ్యూహం. పొలం మధ్యలో నీరుపారే కాలువ ఉంటుంది. ఒక గట్టుమీద నడుస్తూ ఉంటే ఎదురుగా ఎవరో వస్తారు. అప్పుడు అవతల గట్టుకు మారుతుంటాం. అటువైపు ఎవరో ఎదురుపడతారు, ఇటువైపు మారుతుంటాం. నడక ఆగదు, ఇటూ... అటూ... జాగ్రత్తగా దాటుకొంటూ వెళ్ళడమే.

నిషిద్ధాక్షరి వ్యూహం కూడా గట్టు మారడం వంటిది. పృచ్ఛకుని సామర్థ్యాన్ని మొదటి పాదంలో కాదు పదంలోనే అవధాని అంచనా వేస్తాడు. తెలుగులో ప్రారంభించినట్లు కనిపించి సంస్కృతంగా, సంస్కృతమనే భ్రమను కల్గించి తెలుగుగా మార్చుతాడు. ఎప్పటికప్పుడు పదం పూర్తైనట్లు అనిపిస్తుంది కాని పూర్తి కాదు. యతి ప్రాసల వద్ద నిషేధం ఉండదనే వెసులుబాటును అవధాని వాడుకొంటాడు. ద్వ్యక్షరపద పరిమితి అవధానికి శ్రేయస్కరం. అంతకంటే పెద్దపదాలు వాడేటప్పుడు ఆ పదాలు ఎప్పటికప్పుడు పూర్తి అర్థాన్నిస్తున్న భ్రాంతి జనకాలుగా ఉండాలి. సర్వసాధారణంగా నిషేధాక్షరి పద్యాలు నిఘంటు సాపేక్షంగా ఉంటాయి. అవధాని అర్థం చెప్పాల్సి ఉంటుంది. కాబట్టి పద్యం అల్లేటప్పుడే అన్వయాన్ని మనసులో ఉంచుకోవాలి. ఇచ్చిన అంశానికి సంబంధించిన పదాలను నేరుగా వాడడానికి పూనుకొంటే అవధాని దొరికిపోతాడు.

ఇన్ని క్లేశాలను అధిగమించి నిషిద్ధాక్షరి పద్యాలను రమ్యంగా నడిపిన ప్రతిభామూర్తి డా॥ ఆశావాది ప్రకాశరావుగారు. వారు మహాపండితులు సి.వి. సుబ్బన్న శతావధాని గారి శిష్యులు. సీ.వీ.గారి నిషేధాక్షరులు ఎక్కువ భాగం ఏకాక్షరాలతో సంస్కృత సమాసభూయిష్ఠంగా ఉంటాయి. ఆశావాదిగారు గురుమార్గగామి యైనప్పటికీ వీరి నిషిద్ధాక్షరి పద్యాలలో తెలుగుదనం కుడిచేయిగా కనిపిస్తుంది.

గణాలు సరిపోయేటట్లు అక్షరాలు కూర్చి ద్రావిడ ప్రాణాయామంతో అర్థం చెప్పి 'మమ' అనిపించుకొనే తత్వం ఆశావాది నిషిద్ధాక్షరి పద్యాలలో కనిపించదు. కవితా సౌందర్యం, సందేశం, ముద్రాలంకారం ఇలా ఏదో ఒక ప్రత్యేకత ఆశావాది గారి నిషిద్ధాక్షరి పద్యంలో కనిపిస్తుంది. డా॥ ఆశావాదిగారు 171 అవధానాలు చేశారు. వీరి నిషిద్ధాక్షరి కేవలం దైవ స్తుత్యాత్మకములు కాకుండా పౌరాణిక, చారిత్రక ఘట్టాలు, తత్కాలీన సామాజిక సమస్యలు, ప్రసిద్ధ ప్రదేశాలు, పర్వదినాలు, ప్రబోధాలు, శుభాకాంక్షలు మొదలగు వివిధ అంశాలను గూర్చి అడుగబడినవి. వారు ఆయా అంశాలను తన ప్రత్యేక శైలిలో పద్యరూపంలో చెప్పిన విధానాన్ని అనుశీలించడం ఈ వ్యాస లక్ష్యం.

కడపలో జరిగిన అవధానంలో చెప్పిన నిషిద్ధాక్షరి పద్యం ఇలాంటిది.

కం. తొలి కార్పసల్ కడల్ రా
గిల నిండన్ వెల్గులోన కెంగన్నేటన్
వలపున్ పంచన్ రా నీ
తలంపున మదినిల్పి చాల తనియన్ మేమున్.

(2-4-83)

పద్యమంతా అచ్చతెనుగులో నడిచింది. సందర్భం రక్తాక్షి నామ సంవత్సర ఉగాది. తొలికార్ అంటే మొదటి ఋతువు అనగా వసంతం, 'పసల్' పస యొక్క బహువచనం. 'కడ' అనగా చివర అని అర్థం. దాని బహువచనం కడల్, దిక్కులని అన్వయం. వసంత శోభ దిక్కులకు వ్యాపించగా ఉగాది వచ్చింది. 'కెంగన్నేటన్' అనే పదం యోజన అవధానులు మాత్రమే చేయగలిగినది. మరొకరికి అంత అవసరం రాదు. పృచ్ఛకుని ఊహకు కూడా అందదు. రక్తాక్షి నామ సంవత్సరానికి అచ్చ తెనుగు పదమే 'కెంగన్నేడు'. కెంపు, కన్ను కలిపి ప్రాతాది సూత్రం ద్వారా కెంగన్ను అయింది. కెంపు రక్తపర్యాయ పదంకాగా, అక్షికి తెలుగు పదం కన్ను. అయితే ఎఱ్ఱని కన్నులున్నది వ్యక్తులకు కాదు, సంవత్సరానికి. దానికి తెలుగు పదం ఏడు, ఉత్వం మీది సంధి నిత్యం గనుక 'కెంగన్నేడు' అయింది. ఔపవిభక్తికం ద్వారా టుగాగమం, సప్తమ్యంతం వల్ల ద్రుతం వెరసి కెంగన్నేటన్ అయింది. ఇది ఆశ్చర్యకరమైన యోజన.

మొదటి పాదం చివరి అక్షరం 'రా'. పృచ్ఛకుడు వచ్చు క్రియయొక్క క్వార్థకమని భ్రమించి రెండవ పాదం మొదటి అక్షరం నిషేధించడు. రెండవ అక్షరం ప్రాస కాబట్టి నిషేధం ఉండదు. (మిగతా 13వ పేజీలో)

# విశిష్ట తెలుగు భాషా వైభవం 8 ఛందః ప్రాముఖ్యం




- డా. సంగనభట్ల నరసయ్య

## దేశిగణాలు ఎలా పుట్టాయి?

సంస్కృతగణాలకు తెలుగు దేశి గణాలకు సామ్యం లేదు. ఆ వ్యవస్థ. ఈ వ్యవస్థ పూర్తి భిన్న ధృవాలు. తెలుగులో దేశిగణవ్యవస్థ త్ర్యక్షర వ్యవస్థ కాదు. రెండక్షరాల గణాలుంటాయి, నాలుగు అక్షరాల గణాలుంటాయి. యతి సంస్కృత(మార్గి) పద్యాలకు ఇన్ని అక్షరాల తర్వాత (విరుపు) అని ఉంటే, తెలుగు(దేశి) పద్యాలకు ఇన్ని అక్షరాల తరువాత విరుపు అని కాక ఇన్ని గణాల తర్వాత విరుపు / యతి అని ఉంది. సంస్కృత పుత్రిక కావాల్సిన తెలుగు ఛందస్సు స్వతంత్రంగా ఎందుకు ఉంది? అనేది సమాధానించవలసిన ప్రశ్న.

దేశిచ్ఛందాలన్నీ గేయాలనుండి పుట్టినవి. గేయాలన్నీ కాలఖండాల కొలతలు గలవి. కాలఖండాలలో(Time Units) ఉచ్చారణకాలం సమత లయకోసం ఉంటుంది. కాలఖండం మాత్రాసమం. మాత్రాసమత ప్రధానమైనచోట అక్షరసమత ఉండనక్కరలేదు. అందుకే తెలుగు దేశి గణాల్లో అక్షరసమత లేదు. సూర్యగణాలు అని గుంపు గట్టిన న,హ గణాలు 3,2 అక్షరాలు గలవి. ఇంద్రగణాలని గుంపు గట్టిన నల, నగ, సల, భ, ర, త ల్లో మొదటి మూడు చతురక్షర గణాలు. భ,ర,త త్ర్యక్షర గణాలు. కాలఖండం లెక్క. అంతే గాని అక్షరగణనం అక్కరలేదు. సంస్కృత పద్యాలకు మూడేసి అక్షరాలకో నిలువు గీటు గీచి, గణ నిర్ధారణ చేసినట్టు దేశిపద్యాలకు చేయలేం. దేశి గణ వ్యవస్థ ఆధారంగా గణవిభజన చేయాలి. అంటే మాత్రాసమత ప్రధానంగా కాలఖండాలతో చూడాలన్నమాట.

**తొలికోడి కనువిచ్చి నిలచిమై వంచీ**
**జలజలా రెక్కలూ సదలించి నీల్గి**

పై రెండు పాదాలు ఐదేసిమాత్రల కాలఖండాలు. వీటిని తెలుగు ఛాందసికులు మాత్రల లెక్కింపు కోసం గురులఘు నిర్దేశముతో కొలిచినారు. **తొలికో** వరకు సంస్కృత విధానాన్ని బట్టి IIU గా సగణంగా చూసి **డి** అనే అక్షరం ఈ కాలఖండం (Time Unit)లో ఉంది గనుక మరో లఘువు చేర్చి 'సల' గణం అన్నారు. **నిలిచి** – III – నగణం పైన మై వల్ల 'నగ' అన్నారు. ఇక్కడ కాలఖండాన్ని మార్గి గణవ్యవస్థలో కొలిచారు. కాని త్ర్యక్షర గణానుసారిగా కొలువలేరు. ప్రతి కాలఖండం తరువాత విశ్రాంతి దానిక్కారణం. గేయకర్త / గాయకుడు పాట పూర్తయ్యేవరకు ఈ కాలవ్యవస్థలో పదారోహణం చేస్తూ ఆలోచిస్తూ పోతాడు. అవసరం ఐనచోట కాలగణనలో లోపాన్ని నింపేందుకు దీర్ఘీకరిస్తాడు. **జలజలా** లో లకారదీర్ఘం, **రెక్కలూ** లో లుకారదీర్ఘం అలాంటివే.

గానం నుండి లేఖనం వరకు వచ్చేటప్పటికి ఈ రాత తప్పనే భావన ఉదయిస్తుంది. కారణం వ్యాకరణం. **జలజల, రెక్కలు** అని ఈ రీతిగా రాస్తాడు. గానంలో మనస్సే కాలసంపుటికి ప్రమాణం అవుతుంది. గణంలో కొలువడం ఉండదు. రాతలో గణగణనం మొదలౌతుంది. వ్యాకరణం అడ్డు వచ్చి పదం సరిగా ధ్వని మారకుండా రాయమంటుంది. కాంతిని కంతి అని రాయవచ్చు అంటుంది ఈ శాస్త్రం. అర్థభేదక సమర్థకమైనది ధ్వని. అలాంటి ధ్వని వర్ణం. వర్ణ సమూహం నిర్దిష్టక్రమంలో పెడితే పదం. అందుకే ఈ దోషాన్ని

"వెలయఁగ **చెఱకు** విలుగొని... కాకు దోషంబయ్యెన్" అని కవిజనాశ్రయకర్త మల్లియరేచన గేయసంప్రదాయములో చెఱకు, విరాహు లనే పదాలని చెఱకు, విరహు లని రాయాలని లేకుంటే కాకు దోషం అని నిషేధించినాడు.

అందువల్ల **జలజల రెక్కలు సదలించి నీల్గి** అని రాయాలని. రాసినదానిలోని గణములను పరిశీలించి జలజ=నగణం+ల కారణంగా 'నల' గణంగా, రెక్కలు భగణంగా గుర్తించినారు. అపుడు పై గేయానికి సల,నగ (5మాత్రల గణంతో పాటు), నల,భ అనే గణాలు (ఇవి చతుర్మాత్రకాలు) ఒకే గుంపుగా ఈ పాటకు గణాలుగా పేర్కొన్నారు. ఇలాంటి నిర్మాణాలు ర, త గణాలు కూటా మరికొన్ని ఇతర జానపదగీతాల్లో పంచమాత్రాగణాలు చూసి **అమ్మణ్ణి కన్నుల్లు తమ్మిపు వ్వులు** వంటి గీతాల్లో అమ్మణ్ణి, కన్నుల్లు తగణాలుగా; తమ్మిపు రగణంగా గుర్తించారు. వీటిని పంచమాత్రికాలుగా గుర్తించి ఒక గుంపుగా గూర్చి నల, నగ, సల, భ, ర, త లని దానికో పేరు ఇంద్రుని పేరును పెట్టి గుర్తించారు. నిజానికివి నైసర్గికంగా మాత్రాగణాలు అనగా కాలఖండాలు. సమ+అంతర, కాలఖండాలను పునః పునః వాడి కాలసమతను పాటించడం ద్వారా లయను సాధించారు. అందుకే లయ అంటే "సమాంతర కాలఖండాల పౌనఃపున్యం" అన్నాను. **(సశేషం)**

# వేదాల్లో ఘనపాఠం - తెలుగు సాహిత్యంలో అవధానం అధునిక శాస్త్ర దృష్టితో తులనాత్మక పరిశీలన

-ఆచార్య తాడేపల్లి పతంజలి

మానవ నాగరికత చరిత్రలో జ్ఞానాన్ని భద్రపరచడానికి లిపిని ఆశ్రయించని ఏకైక మరియు అద్భుతమైన సంప్రదాయం భారతీయ వైదిక సంప్రదాయం. వేల ఏళ్ళ క్రితం ఉద్భవించిన వేద మంత్రాలను, వాటిలోని అక్షర క్రమాన్ని, ఉచ్చారణా శైలిని మరియు స్వర భేదాలను ఏ మాత్రం మార్పు చెందకుండా నేటికీ సజీవంగా ఉంచడం అనేది ప్రపంచ మేధో చరిత్రలోనే ఒక అద్భుతం. ఈ ప్రక్రియలో శిఖరాగ్ర స్థాయిలో నిలిచే 'ఘనపాఠి' అనే పదము, దాని వెనుక ఉన్న క్లిష్టమైన పఠన పద్ధతులు, మరియు ఆ పద్ధతులు మానవ మెదడుపై చూపే ప్రభావాలు, సాహిత్య అవధానానికి, వేదావధానానికి మధ్య గల పోలికలు విశ్లేషించడం ఈ వ్యాసం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

**ఘనపాఠి: పద వ్యుత్పత్తి మరియు భాషాసంబంధిత విశ్లేషణ**

తెలుగు సామాన్య వ్యవహారిక భాషలో ఒక వ్యక్తి యొక్క అసాధారణ సామర్థ్యాన్ని లేదా పాండిత్యాన్ని సూచించడానికి 'ఘనాపాటీ' లేదా 'ఘనపాటీ' అనే పదాలను తరచుగా ఉపయోగిస్తుంటారు. అయితే, వ్యుత్పత్తి శాస్త్రం మరియు వైదిక పరిభాష ప్రకారం ఈ పదాలు దోషపూరితమైనవి. సరైన పదం 'ఘనపాఠి'. ఈ పదం యొక్క మూలాలను పరిశీలిస్తే, ఇది 'ఘన' మరియు 'పాఠి' అనే రెండు సంస్కృత పదాల కలయికగా కనిపిస్తుంది. వేద పఠనంలో అత్యంత క్లిష్టమైన మరియు సంక్లిష్టమైన పద్ధతిని 'ఘన పాఠం' అని పిలుస్తారు. ఈ పాఠంలో ప్రావీణ్యం సంపాదించిన పండితుడిని 'ఘనపాఠి' అని గౌరవిస్తారు.

వైదిక శాస్త్రాల ప్రకారం, ఒక విద్యార్థి వేదాన్ని కేవలం సాధారణ వాక్య రూపంలో నేర్చుకోవడం ప్రాథమిక స్థాయి. కానీ ఆ పద్ధతిలో కాలక్రమేణా అక్షరాలు లేదా స్వరాలు మారిపోయే ప్రమాదం ఉందని భావించిన ప్రాచీన ఋషులు, అష్ట వికృతులను రూపొందించారు. వీటిలో ఘన పాఠం చివరిది. ఎవరైతే ఈ పద్ధతిని కంఠస్థం చేసి, తప్పు లేకుండా పఠించగలరో వారు మాత్రమే 'ఘనపాఠి' అనే బిరుదుకు అర్హులు. పదాల సాధు రూపాలను పరిశీలిస్తే, "ఘనాపాటీ" అనేది సామాన్య జనుల వ్యవహారంలో వచ్చిన అపభ్రంశ రూపం కాగా, "ఘనపాటీ" అనేది 'పాఠి' లోని 'ఠ' కారాన్ని సరిగా పలకకపోవడం వల్ల ఏర్పడిన దోషం, మరియు "ఘనపాఠి" అనేది శాస్త్రీయంగా, వైదికపరంగా ఆమోదించబడిన సాధు రూపం.

**వేద సంరక్షణలో మౌఖిక సంప్రదాయం మరియు శిక్షా శాస్త్రం**

వేదాలను 'శ్రుతి' అని అంటారు, అంటే 'వినబడినది' అని అర్థం. వీటిని లిఖిత రూపంలో కాకుండా కేవలం గురు-శిష్య పరంపరలో శ్రవణం (వినడం) మరియు ఉచ్చారణ (పలకడం) ద్వారా మాత్రమే కాపాడుకుంటూ వచ్చారు. ఈ సంరక్షణ ప్రక్రియలో 'శిక్షా శాస్త్రం' కీలక పాత్ర పోషిస్తుంది. తైత్తీరీయ ఉపనిషత్తులోని శిక్షావల్లి ప్రకారం, వేద పఠనంలో ఆరు ముఖ్యమైన అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి.

**1.వర్ణం:** అక్షరాల యొక్క స్వచ్ఛమైన ఉచ్చారణ. ప్రతి అక్షరం దాని పుట్టుక స్థానం (స్థాన-కరణాలు) నుండి సరిగ్గా వెలువడాలి.

**2.స్వరం:** వేద మంత్రాలకు స్వరం ప్రాణం. ఉదాత్త, అనుదాత్త మరియు స్వరిత అనే మూడు ప్రాథమిక స్వరాలు ఉంటాయి.

**3.మాత్ర:** ఒక అక్షరాన్ని పలకడానికి పట్టే సమయం. ఇది హ్రస్వ, దీర్ఘ మరియు ప్లుత అని మూడు రకాలుగా ఉంటుంది.

**4.బలం:** ఉచ్చారణలో ఉపయోగించే శ్వాస లేదా ప్రయత్నం.

**5.సామం:** మంత్రాన్ని ఒకే విధమైన లయలో, వేగంలో పఠించడం.

**6.సంతానం:** పదాల మధ్య సంధులు మరియు విరామాలను (Punctuation) పాటించడం.

ఈ ఆరు అంశాలను తూచా తప్పకుండా పాటించడం వల్లే వేదం తన సహజత్వాన్ని కోల్పోలేదు. ఒకవేళ స్వరం మారితే మంత్రం యొక్క అర్థమే మారిపోతుందని, అది విపరీత ఫలితాలను ఇస్తుందని ప్రాచీన విజ్ఞులు హెచ్చరించారు. ఉదాహరణకు, 'ఇంద్రశత్రుః' అనే పదంలో స్వరం మారడం వల్ల అది ఇంద్రుడిని చంపేవాడు అనే అర్థం నుండి, ఇంద్రుడి చేతిలో చనిపోయేవాడు అనే అర్థానికి మారిపోయిన ఉదాహరణను వేద వ్యాకరణం వివరిస్తుంది.

**వేద పఠన పద్ధతులు: ప్రకృతి, వికృతి పాఠాల విశ్లేషణ**

వేద మంత్రాలను భద్రపరచడానికి ఋషులు 11 రకాల పఠన శైలులను రూపొందించారు. వీటిని రెండు ప్రధాన వర్గాలుగా విభజించవచ్చు: ప్రకృతి పాఠాలు మరియు వికృతి పాఠాలు.

ప్రకృతి పాఠాలు వేద మంత్రం యొక్క సహజ క్రమాన్ని అనుసరిస్తాయి మరియు ఇవి మూడు రకాలు. సంహితా పాఠం 1 2 3 4 అనే క్రమంలో ఉండి మంత్రాలకు ప్రవాహశీలతను,

లయబద్ధతను ఇస్తుంది. పదపాఠం 1, 2, 3, 4 అనే క్రమంలో ఉండి ప్రతి పదం యొక్క అసలు స్వరూపాన్ని గుర్తించడంలో సహాయపడుతుంది. క్రమపాఠం 1-2, 2-3, 3-4 అనే క్రమంలో ఉండి పదాల మధ్య సంధి సంబంధాలను ధృవీకరిస్తుంది.

ప్రకృతి పాఠాల తర్వాత మరింత క్లిష్టమైన ఎనిమిది వికృతి పాఠాలు ఉంటాయి. వీటినే 'అష్ట వికృతులు' అంటారు. ఇవి మంత్రాలలోని పదాలను వెనుకకు ముందుకు తిప్పి చదవడం ద్వారా అక్షర మరియు స్వర దోషాలను పూర్తిగా నివారిస్తాయి. ఈ ఎనిమిది పద్ధతులు: జట, మాల, శిఖ, రేఖ, ధ్వజ, దండ, రథ మరియు ఘన. వీటిలో జటా పాఠం జడ అల్లినట్లుగా 1-2, 2-1, 1-2 క్రమంలో సాగితే, శిఖా పాఠం చివరన ఒక అదనపు పదాన్ని చేరుస్తుంది. ఘన పాఠం వీటిలో అన్నిటికంటే అత్యున్నతమైనది మరియు అత్యంత సంక్లిష్టమైన నిర్మాణాన్ని కలిగి ఉంటుంది.

**ఘనపాఠం: మేధోపరమైన సవాలు మరియు గణిత స్వభావం**

ఘన పాఠం యొక్క క్లిష్టతను అర్థం చేసుకోవడం ద్వారా, ఒక ఘనపాఠీ తన మేధస్సును ఏ స్థాయిలో శిక్షణ పొందాడో గుర్తించవచ్చు. ఒక మంత్రంలోని మొదటి మూడు పదాలను 1,2,3 అనుకుంటే, ఘనపాఠం ఈ క్రింది క్రమాన్ని అనుసరిస్తుంది:

ఈ పద్ధతిని 'ఘన' అని ఎందుకు అంటారంటే, ఇది గంట ఆకారాన్ని పోలి ఉంటుంది. అంటే ఒక పాయింట్ నుండి ప్రారంభమై, వెనక్కి వెళ్ళి, మళ్ళీ ముందుకు సాగి విస్తరిస్తుంది. ఘన పాఠం పఠించేటప్పుడు ప్రతి పదము మరియు స్వరం సుమారు 13 సార్లు పునరావృతమవుతాయి. తైత్తిరీయ సంహిత వంటి పెద్ద గ్రంథాలను ఈ పద్ధతిలో కంఠస్థం చేయడం అనేది అసాధారణమైన మేధో ప్రక్రియ. శాస్త్రీయ కోణంలో చూస్తే, ఇది ఒక 'సెల్ఫ్-కరెక్టింగ్ అల్గారిథమ్' లా పనిచేస్తుంది.

**సంస్కృత ప్రభావం: నాడీ విజ్ఞాన పరమైన పరిశోధనలు**

వేద మంత్రాల పఠనం మరియు ఘన పాఠం వంటి క్లిష్టమైన పద్ధతులు మానవ మెదడుపై ఎలాంటి ప్రభావం చూపుతాయో తెలుసుకోవడానికి ఆధునిక విజ్ఞాన శాస్త్రవేత్తలు అనేక పరిశోధనలు చేశారు. డాక్టర్ జేమ్స్ హార్ట్జెల్ వంటి నాడీ శాస్త్రవేత్తలు దీనిని 'సంస్కృత ప్రభావం' అని పిలిచారు.

నేషనల్ బ్రెయిన్ రీసెర్చ్ సెంటర్ అధ్యయనాల ప్రకారం, మెదడులోని హిప్పోకాంపస్ జ్ఞాపకశక్తి నిల్వకు సహాయపడుతుంది. హిప్పోకాంపస్ అనేది మానవ మెదడులోని అత్యంత కీలకమైన భాగం. ఇది మెదడులోని 'టెంపోరల్ లోబ్' (Temporal Lobe) లోపల, రెండు వైపులా వంపు తిరిగిన ఆకారంలో ఉంటుంది.

గ్రీకు భాషలో 'హిప్పోస్' అంటే గుర్రం, 'కాంపోస్' అంటే సముద్రపు రాక్షసి అని అర్థం. దీని ఆకారం సముద్రపు గుర్రం లాగా ఉండటం వల్ల దీనికి ఆ పేరు వచ్చింది.

హిప్పోకాంపస్ మన మెదడులో ప్రధానంగా రెండు పనులను నిర్వహిస్తుంది:

☛ **జ్ఞాపకశక్తి:** మనం నేర్చుకున్న కొత్త విషయాలను స్వల్పకాలిక జ్ఞాపకాల నుండి దీర్ఘకాలిక జ్ఞాపకాలుగా మార్చడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. ఇది లేకపోతే కొత్త విషయాలను గుర్తుంచుకోవడం అసాధ్యం.

☛ **స్థాన జ్ఞానం:** మనం ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి వెళ్లడానికి, దారి గుర్తుంచుకోవడానికి ఇది మెదడులోని 'మ్యాప్' లాగా పనిచేస్తుంది.

అవధాన ప్రక్రియలో అవధాని ఒకేసారి ఇన్ని విషయాలను గుర్తుంచుకోవడానికి (ధారణా శక్తికి), వారి మెదడులోని హిప్పోకాంపస్ మరియు ప్రీ-ఫ్రంటల్ కార్టెక్స్ మధ్య జరిగే సమన్వయమే కారణం.

ప్రీ-ఫ్రంటల్ కార్టెక్స్ అనేది మన మెదడుకు "ముఖ్య కార్య నిర్వహణాధికారి" వంటిది. ఇది మెదడు ముందు భాగంలో, అంటే మన నుదురు వెనుక ఉండే అత్యంత పరిణతి చెందిన భాగం.

సాహిత్య అవధానంలో చెప్పిన నిషిద్ధాక్షరి, సమస్యా పూరణం, మరియు అప్రస్తుత ప్రసంగం వంటి ప్రక్రియలను నిర్వహించే అసలు "కంట్రోల్ రూమ్" ఇదే. దీని ప్రధాన విధులను ఇలా అర్థం చేసుకోవచ్చు:

**1. నిర్ణయ నిర్ణయం**

మనం ఏ పని చేయాలి, ఏది చేయకూడదు అనే విచక్షణను ఇది కలిగి ఉంటుంది. అవధానంలో ఒక పద్యం అల్లేటప్పుడు, ఏ పదం వాడాలి, ఏది వాడకూడదు అనే నిర్ణయాన్ని క్షణాల్లో తీసుకునేది ఇదే.

**2. కార్యనిర్వాహక విధులు**

దీనిని 'మేనేజ్మెంట్ సెంటర్' అని కూడా అంటారు. ఇది ఈ క్రింది వాటిని నియంత్రిస్తుంది:

☛ **ప్రణాళిక:** ఒక సమస్యకు పద్యం ఎలా మొదలుపెట్టాలి, ఎలా ముగించాలో ప్లాన్ చేయడం.

☛ **నియంత్రణ:** నిషిద్ధాక్షరిలో నిషేధించిన అక్షరం నోటికి వచ్చినా, దానిని ఆపి, ప్రత్యామ్నాయ అక్షరాన్ని వెతకడం.

☛ **ఏకాగ్రత:** అప్రస్తుత ప్రసంగం చేసే వ్యక్తి విసిరే జోకులకు నవ్వుతూనే, పద్యం అల్లడంపై ఏకాగ్రతను నిలపడం.

**3. వర్కింగ్ మెమరీ**

హిప్పోకాంపస్ దీర్ఘకాలిక జ్ఞాపకాలను దాస్తే, ప్రీ-ఫ్రంటల్ కార్టెక్స్ లిలి"వర్కింగ్ మెమరీ"లిలిని నిర్వహిస్తుంది. అంటే, ఒక పని జరుగుతున్నప్పుడు ఆ సమాచారాన్ని మెదడులో తాత్కాలికంగా ఉంచి ప్రాసెస్ చేయడం. వ్యస్తాక్షరిలో అక్షరాల

స్థానాలను తాత్కాలికంగా హోల్డ్ చేసి, చివరలో అమర్చడానికి ఇది చాలా అవసరం.

**4. భావోద్వేగ నియంత్రణ**

సభా భయం కలగకుండా ఉండాలన్నా, ఎదుటివారు విమర్శించినా లేదా అప్రస్తుత ప్రసంగంతో విసిగించినా సహనంతో సమాధానం చెప్పగలిగేలా చేసేది ఈ భాగమే.

ఒక్క మాటలో చెప్పాలంటే:

☛**హిప్పోకాంపస్:** సమాచారాన్ని దాచి ఉంచే 'లైబ్రరీ'

☛**ప్రీ-ఫ్రంటల్ కార్టెక్స్:** ఆ సమాచారాన్ని ఎలా వాడాలి, ఏది ముఖ్యం, ఏది అనవసరం అని నిర్ణయించే 'మేనేజర్'

అందుకే అవధానులు తమ మేధో శక్తితో ఈ రెండింటి మధ్య అద్భుతమైన సమన్వయాన్ని సాధిస్తారు.

వేద పఠనం అనేది కేవలం ఒక ఆధ్యాత్మిక ప్రక్రియ మాత్రమే కాదు, అది ఒక శక్తివంతమైన మెదడు వ్యాయామం.

**ధారణ: మనస్సును ఏకాగ్రతతో నిలుపుకునే కళ**

ఘనపాఠీకి కావలసిన ప్రాథమిక శక్తి 'ధారణ'. పతంజలి యోగ సూత్రాల ప్రకారం, "దేశబంధశ్చిత్తస్య ధారణా" – అంటే మనస్సును ఒకే చోట కట్టివేయడం. అష్టాంగ యోగంలో ధారణ ఆరవ మెట్టు. ఆధునిక ప్రపంచంలో సమాచార వెల్లువ వల్ల మనుషులలో ఏకాగ్రత తగ్గుతున్న తరుణంలో, ధారణా శక్తిని పెంపొందించుకోవడానికి ప్రాచీనమార్గాలు ఎంతో ఉపయోగకరం.

ధారణను పెంపొందించుకోవడానికి కొన్ని ముఖ్యమైన పద్ధతులు ఉన్నాయి

శ్వాసనియంత్రణ ద్వారా వేగస్ నాడిని ఉత్తేజితం చేసి మనస్సును ప్రశాంత పరచవచ్చు. ప్రత్యాహారం ద్వారా బాహ్య విక్షేపాలను తగ్గించి ఏకాగ్రతను పెంచుకోవచ్చు. ఒక నిర్దిష్ట వస్తువుపై దృష్టిని నిలిపే ఏకపక్ష దృష్టి ధారణను బలపరుస్తుంది. అలాగే విషయాలను చిత్రాలుగా ఊహించుకోవడం మెదడులోని విజువల్ మరియు ఆడిటరీ నెట్‌వర్క్‌ల మధ్య సమన్వయాన్ని పెంచుతుంది.

**అవధానం: తెలుగు సాహిత్య ధారణా వైభవం**

వేదాల్లో ఘనపాఠం ఎలాంటిదో, తెలుగు సాహిత్యంలో 'అవధానం' అటువంటిది. ఇది మనస్సు యొక్క ఏకకాలిక బహుళ కార్యసాధక సామర్థ్యానికి ఒక నిదర్శనం. ఒక అష్టావధాని ఎనిమిది మంది పృచ్ఛకులతో ఒకే సమయంలో సంభాషిస్తూ, వారు అడిగే సాహిత్య సమస్యలను పూరిస్తూ, మధ్యలో వచ్చే ఆటంకాలను తట్టుకుని నిలబడాలి. ఈ ప్రక్రియలో అత్యంత కీలకమైన భాగం 'ధారణ'.

అవధాన ప్రక్రియలోని వివిధ విభాగాలు ధారణా శక్తిని విభిన్నంగా పరీక్షిస్తాయి. నిషిద్ధాక్షరి ఒక అక్షరాన్ని వాడకుండా పద్యం అల్లడం ద్వారా అక్షర నియంత్రణను చూపిస్తుంది. వ్యస్తాక్షరి చెల్లాచెదురుగా ఇచ్చిన అక్షరాలను వాటి స్థానాలతో గుర్తుంచుకోవడం ద్వారా స్థాన జ్ఞాపకశక్తిని పరీక్షిస్తుంది. సమస్యా పూరణం క్లిష్టమైన సమస్యకు పద్యరూపంలో పరిష్కారం చూపిస్తూ సృజనాత్మక ధారణను ప్రదర్శిస్తుంది. అప్రస్తుత ప్రసంగం అనేది అసంబద్ధమైన మాటల మధ్య కూడా ఏకాగ్రత కోల్పోకుండా విక్షేపాలను తట్టుకునే సామర్థ్యాన్ని పరీక్షిస్తుంది.

సాహిత్య అవధానానికి, వేదావధానానికి మధ్య గల పోలికలు చాలా లోతైనవి. రెండింటిలోనూ ప్రధానంగా ఏకాగ్రత , ధారణ , మరియు నియంత్రణ అనేవి మూలస్తంభాలు.

**1. అక్షర నియంత్రణ – నిషిద్ధాక్షరి వికృతి పాఠాలు**

నిషిద్ధాక్షరిలో ఒక అక్షరాన్ని వాడకుండా పద్యం చెప్పడం ఎంత కష్టమో, వేదావధానంలో 'జటాపాఠం' లేదా 'ఘనపాఠం' చెప్పడం అంతకంటే క్లిష్టమైనది. వేద మంత్రాలలోని అక్షరాల క్రమాన్ని వెనక్కి ముందుకి (ఉదాహరణకు: 1-2, 2-1, 1-2-3, 3-2-1) మార్చి చెప్పేటప్పుడు, ఎక్కడా పొరపాటు రాకుండా అక్షరాలను నియంత్రించడం నిషిద్ధాక్షరి వంటి అక్షర క్రమ శిక్షణనే సూచిస్తుంది.

**2. స్థాన జ్ఞాపకశక్తి – వ్యస్తాక్షరి – వర్ణక్రమం**

వ్యస్తాక్షరిలో అక్షరాల స్థానాలను ఎలా గుర్తుంచుకుంటారో, వేదావధానంలో 'లక్షణ గ్రంథాల' ఆధారంగా ప్రతి అక్షరం యొక్క స్వభావాన్ని గుర్తుంచుకుంటారు. ఒక మంత్రంలో ఫలానా అక్షరం ఎక్కడ ఉంది, దానికి ఏ స్వరం (ఉదాత్తం, అనుదాత్తం, స్వరితం) ఉండాలి అనే అంశం వ్యస్తాక్షరి తరహాలోని స్థాన జ్ఞానాన్ని పరీక్షిస్తుంది.

**3. సృజనాత్మకధారణ – సమస్యాపూరణం – అర్థానుసంధానం**

సాహిత్య అవధానంలో సమస్యకు పరిష్కారం చూపడం ఒక కళ అయితే, వేదావధానంలో మంత్ర భాగాలను విడదీసి చెప్పే 'పద పాఠం' ఒక విశ్లేషణాత్మక ప్రక్రియ. క్లిష్టమైన సంధి నియమాలను విడదీస్తూ, మంత్రం యొక్క అసలు రూపాన్ని భంగం కలగకుండా చెప్పడం సమస్యా పూరణంలో ఉండే మేధోమథనం వంటిదే.

**4. విక్షేపాలను తట్టుకోవడం – అప్రస్తుత ప్రసంగం – స్వర భేదం**

అప్రస్తుత ప్రసంగంలో పక్కదారి పట్టించే మాటలను భరిస్తూనే పద్యాన్ని పూర్తి చేసినట్లు, వేదావధానంలో పక్కన ఉన్నవారు వేరే స్వరంతో చదువుతున్నా లేదా ఇతర శబ్దాలు వినిపిస్తున్నా, అవధాని తన మంత్రస్వరాన్ని ఏమాత్రం మార్చకుండా స్థిరంగా చదవాలి. ఇది అచ్చంగా బాహ్య విక్షేపాలను తట్టుకునే ఏకాగ్రత పరీక్ష.

(మిగతా 13వ పేజీలో)

# చతుర సంభాషణము

నన్నయ యద్భుత చతుర సంభాషణా నిర్వహణ కౌశలమునకు మరియొక యుదాహరణము;

శంతనుడు యమునాతీరమున వేటకేగి యచట సత్యవతీ దేహ సౌందర్య దర్శనముచే "మనోజ బాణ సంతాన హతాత్ముఁడై" యామెను పత్నిగా పొందగోరినాడు. ఆమె తండ్రియైన దాశరాజు కోరికలు విని "శంతనుడు గాంగేయు యువరాజుఁ దలఁచి యీ పల్కు దక్కగ నొండు వేడుమ యిచ్చెదనని" (ఆది 4 – 177) ధర్మబద్ధముగనే తిరస్కరించి తాను "ప్రతిహత మనోరథుండయి క్రమ్మఱి నిజపురంబునకు వచ్చి, చింతాక్రాంతుడయి సత్యవతిని తలచుచు నివృత్త కార్యాంతరుండయి యున్నాడు. అట్టి తండ్రి మనః పరితాప కారణ మఱయగోరినాడు గాంగేయుడు.

దేవవ్రతుడు రాజనీతిలో శిక్షణ పొందినవాడు కనుక కొన్ని విషయము లాతడు తన స్థాయిలో తాను తెలిసికొనినాడు. మరికొన్ని యూహించినాడు. కానీ స్పష్టత కొఱకు ప్రత్యక్షముగా కారణ మఱయ గోరుచున్నాడు. రాజైన తండ్రితో సున్నితమైన విషయమును ప్రస్తావించవలసి వచ్చినది. వాక్య నిర్మాణము చూడుడు.

చం. భవదభిరక్షిత క్షితికి బాధ యొనర్పగ నోపునట్టి శా
త్రవనివహంబు లేదు, వసుధాప్రజ కెల్ల ననంత సంతతో
త్సవముల, రాజులెల్ల ననిశంబు విధేయుల నీకు, నిట్లు మా
నవవృషభేంద్ర! యేలొకొ మనఃపరితాపము బొంది యుండఁగన్
(ఆది 4 – 179)

ఉత్తముడైన రాజునకు ముఖ్యమైనవి రాజ్యము ప్రజలు. రాజ్యమునకు శత్రుబాధ కలిగినప్పుడు లేదా ప్రజలు మృగ రాక్షస చోరాది భయకంపితులైనప్పుడు రాజు కలత చెందవలె. ఈ దృష్ట్యా దేవవ్రతుడు "అభిరక్షిత" యనుటలో నీవు ముందుగనే రాజ్యమును సర్వతోభద్ర మొనర్చినా వనియు, "శాత్రవనివహం" బనుటలో ఒక్క శత్రువు కాక శత్రువులందఱు నేకమై వచ్చిన ననియు, "బాధ యొనర్పగ నోపునే" యనుటలో కీడు చేయుట కాదు చేయ తలపెట్టువారు కూడా లేరనియు, "మానవ వృషభేంద్ర" యనుటలో నీకంటెను శ్రేష్ఠులు మానవులలో లేరనియు ధ్వనింపజేసినాడు.

ఇక శంతనుని సమాధానము – ఆయన కామపీడితుడు. సమాధాన మీయవలసినది వివాహ వయస్కుడైన కుమారునకు. అందునా , దేవవ్రతుని ప్రశ్న యాతని నిరుపమాన ధర్మదీక్షను తెలుపుచున్నది. ఆతడు చెప్పినవానిలో నే యొక్కటియును తన దుఃఖమునకు హేతువులు కావు. కనుక మాటలు కూర్చు కొనుటకు "పెద్దయుం ప్రొద్దు చింతింప" వలసి వచ్చినది.

# పద్యపరీమళం

**- అన్నమరాజు ప్రభాకరరావు**

అట్టివానికి తన దుఃఖహేతువు చెప్పినచో నది యుభయులకును బాధాహేతు వగునేమో. అసత్యము చెప్పినందు వలన ప్రయోజనము లేదు. కనుక శంతనుడు వెంటనే సమాధాన మీయలేదు. "పెద్దయుం ప్రొద్దు చింతించి"

కం. వినవయ్య యేక పుత్త్రుడు
ననపత్యుడు నొక్క రూప యని ధర్మువులన్
విని నీకుఁ దోడు పుత్త్రుల
ననఘా ! పడయంగ నిష్ట మయినది నాకున్
(ఆది 4 – 181)

కం. జనవినుత ! యగ్నిహోత్రం
బును సంతానమును వేదములు నెడతెగగా
జన దుత్తమవంశజులకు
ననిరి మహాధర్మనిపుణు లైన మునీంద్రుల్
(ఆది 4 – 182)

ఏక పుత్త్రుడు ననపత్యుడు నొక్కటే యని ధర్మమెఱిగిన వారందురు. కనుక "నీకు దోడు" పుత్త్రుల పడయంగ గోరు చున్నాను. అంతేకాక, అగ్నిహోత్రము యొక్కయు, సంతానము యొక్కయు, వేదముల యొక్కయు పరంపర ఆగకుండా చూచుట యుత్తమవంశజుల కర్తవ్యమని "మహాధర్మనిపుణులైన మునీంద్రు"ల వాక్కనినాడు. కానీ, యిచ్చట పై మూడింటిలో నే యొక్కటియు నెడతెగుట కప్పటి కవకాశము లేదు. నిత్యాగ్నిహోత్రములు నిర్వహించబడుచునే యున్నవి, వేదముల గురుకులముల ద్వారా రక్షింపబడుచునే యున్నవి. సంతానము – సర్వ సమర్థుడైన కుమారు డెదుటనే యున్నాడు. అయినను, యీ కారణము చేత కూడా నేను వివాహమాడ గోరుచున్నా ననినాడు (ఇచ్చట – దేవవ్రతుని ద్వారా వంశవృద్ధి జరుగదని భావికథా సూచన చేయుచున్నాడు కవి). ఇది యంతయును తన మాటగా కాక "మహాధర్మ నిపుణులైన మునీంద్రుల" వాక్కుగా చెబుతున్నాడు. "అనఘా" యనుటలో నీవును ధర్మవిదుడవు. నిన్నిప్పటివరకు పాపమంటలేదు. ఇప్పుడు ధర్మోల్లంఘనకు నీవు (పరోక్షముగనైనను) కారణమైనచో నిన్ను పాపమంటు ననినాడు. "జననుత" యనుటలో నేటిదనుక నీ ధర్మవర్తనమును గాంచిన ప్రజలు (మిగతా 10వ పేజీలో)

# వ్యాకరణ వరివస్య 9

ఎన్.సిహెచ్. చక్రవర్తి

సంస్కృతభాషలో సంధికి, తెలుగుభాషలో సంధికి తేడా ఉంది. సంస్కృతంలో సంధి బహువిస్తారమైన ప్రణాళిక. తెలుగులో అలా కాదు. తెలుగులో రెండు అచ్చులు పరమైనప్పుడు సంధి రావడం అంటే

1) ప్రధానంగా పరరూప సంధియే.

2) సంధి రాకుంటే యడాగమం వస్తుంది.

3) నుగాగమ,రుగాగమాదులు కొన్నిచోట్ల వస్తాయి.

4) కొద్దిచోట్ల సంధిపదం అన్యరూపాన్ని ధరిస్తుంది.

అచ్చుల సంధి వరకు ప్రధానంగా ఇంతే.

చిన్నయసూరి తన బాలవ్యాకరణం సంధి పరిచ్ఛేదంలో ఉత్తునకచ్చు పరంబగునపుడు సంధియగు అని మొదటి సూత్రం చెప్తూ దానికి అనుబంధంగా **పూర్వపరస్వరంబులకు పరస్వరం బాదేశంబగుట సంధి యనంబడు** అని సంధి అంటే ఏమిటో వివరణ ఇచ్చారు.

స్వరము అంటే అచ్చు. రెండు అచ్చులు కలిసేటప్పుడు అందులో మొదటి అచ్చు పూర్వ అచ్చు.. రెండవ అచ్చు పర అచ్చు. రెండు అచ్చులు కలిసినప్పుడు తెలుగులో **సంధి వస్తే** మొదటి అచ్చు లోపించి రెండో అచ్చు ధ్వని మాత్రమే వినిపిస్తుంది(నిలుస్తుంది). అంటే ఇది పరరూప సంధి. పూర్వ అచ్చు, పర అచ్చు ఈ రెండిటి స్థానంలో పరఅచ్చు ఏదో అదే వస్తుంది. ఆదేశంగా వస్తుంది. కొన్నిటి స్థానంలో..వాటిని తొలగించి .. మరొకటి వస్తే దానిని ఆదేశం అంటాము. రెండు అచ్చులు కలుస్తున్నప్పుడు రెండోఅచ్చు ధ్వని మాత్రమే నిలిచి ఉంటే అక్కడ సంధి జరిగింది అని గుర్తించాలి.

ఇది అచ్చు సంధి గురించి చిన్నయ గారి నిర్దేశం.

సంధి పరిచ్ఛేదంలో మొదటి సూత్రంలో ఇచ్చిన ఈ సంధి నిర్వచనం ద్వారా మరొక అంశం ప్రస్తావనకు వస్తుంది. సంధి అనేది రెండు అచ్చుల మధ్య జరిగే చర్య అయినప్పుడు...అచ్చుకు హల్లు లేదా సంధిగతంగా హల్లుకు అచ్చు పరమైనా అలాగే సంధిగతంగా హల్లుకు హల్లు పరమైన సందర్భాలను కూడా సంధి అని ఎలా వ్యవహరిస్తాము!! అచ్చుకు అచ్చుకు పరమైనప్పుడు మాత్రమే సంధి అనాలి కదా! కానీ వ్యవహారంలో మనం నుగాగమసంధి, సరళాదేశ సంధి ఇలా వ్యవహరిస్తున్నాం కదా! ఇది ఎలా సంగతం అవుతుంది? అని ఒక ప్రశ్న వస్తుంది.

దీనికి ఇలా చెప్పుకోవచ్చు:

పూర్వపర స్వరాలు పరమైనప్పుడే సంధి అని సూరి గారు చెప్పినా సంధి పరిచ్ఛేదం లోనే సరళాదేశాదులు, నుగాగమాదులను కూడా చెప్పడం వల్ల వాటిని కూడా సంధులుగానే పరిగణించడం సూరి గారికి సమ్మతమే అని గ్రహించాలి.

**మరో విషయం:** సంజ్ఞాపరిచ్ఛేదం 17 లో **యకారము, వువూవొవో లు తెలుగు మాటలకు మొదట లేవు** అని చెప్తూ **హరియతడు, నిద్రవోయె మొదలైనచోట్ల సంధి వశంబున వచ్చిన యకార, వకారంబులు గాని పూర్వసిద్ధంబులు కావు** అని స్వయంగా సూరి గారే సంధి అని ప్రయోగించడం వల్ల ఇవన్నీ సంధులే అని సూరిగారు చెప్పినట్లే.

ఈ విధంగా సంధిపరిచ్ఛేదంలో ప్రస్తావించిన సందర్భాలన్నీ సంధులుగానే పరిగణింపబడతాయి అని గ్రహించాలి. **(సశేషం)**


(9వ పేజీ తరువాయి) **చతుర సంభాషణము**

నిన్ను గీర్తించుచున్నారు. మున్ముందును నీవిట్లే యుండ వలయును సుమా! యని ధ్వనించుచున్నది.

**కం. నీ వస్త్రశస్త్రవిద్యా**
**కోవిదుడవు రణములందు గ్రూరుఁడ వరివి**
**ద్రావణ సాహసికుండవు**
**గావున నీ యునికి నమ్మగానేర నెదన్** (ఆది 4 – 183)

ఇంకా చెబుతున్నాడు. నీ వస్త్రశస్త్ర విద్యాకోవిదుడవు. రణ రంగములో నిర్దయుడవు. నిర్దాక్షిణ్యముగా శత్రువధ చేయుటలో నీకు సాహసమెక్కువ. సాహసము అను పదమునకు ముందు వెనుకలు గమనింపని తెగింపు అని అర్థము కలదు. నీ వట్లు యుద్ధము చేయుచున్నప్పుడు నీకు కీడు సంభవింప వచ్చును. కనుక నీ యునికిని నమ్మలేను (నాటికి దేవవ్రతునికి "స్వచ్ఛంద మరణ" వరము లేదు).. కనుక "బహుపుత్త్రార్థంబు యత్నంబు సేయవలయు వివాహం బయ్యెద" ననినాడు.

ఒక ధర్మనిరతుడు, వీరుడు, వివేకి, పితృభక్తి పరాయణుడునైన కుమారుడు ధర్మనిరతుడు, చక్రవర్తియునైన తండ్రితో చర్చించ వలసినప్పుడు గానీ, అట్టి తండ్రి సమర్థుడు ధర్మజ్ఞుడునైన పుత్త్రున కతి సున్నితాంశమును వివరింపవలసి నప్పుడు గానీ వహించ వలసిన వాఙ్మర్యాదను మిగుల నైపుణ్యముతో చిత్రించినాడు నన్నయ్య. ఇట్లనేక సందర్భములలో సంభాషణములను నన్నయ్య మిగుల యుక్తి యుక్తముగా నిర్వహించినాడు.




# కవికల్పలత

కవిత్వసాధన చేయదలచిన వారికోసం సంస్కృతంలో దేవేశ్వర మహాకవి చేత వ్రాయబడిన గ్రంథం కవికల్పలత. దానిని శ్రీ కల్లూరు వేంకట సుబ్రహ్మణ్య దీక్షితులవారు ఆంధ్ర వివరణతో 1930లో ప్రకటించి ఉన్నారు. ఇది అవధానులకు అత్యంత ఉపయుక్తమైన గ్రంథము.

కవిత్వరచనకు ఆవశ్యకమైన పదసంఘటన, భావకల్పన, రస సామగ్రి, వర్ణనావిధానములే కాక శ్లేషను సాధించే విధానము. వివిధ అలంకారాలను ఛందస్సులను సమకూర్చే విధానములు కూడా ఇందులో తెలుపబడినవి, ముఖ్యంగా అవధానులకు ఉపయోగకరమైన చిత్రకవిత్వపద్ధతి, సమస్యాపూరణ మొదలగు అంశాలు ఇందులో ఉన్నాయి. దేవేశ్వరకవి దానిని శబ్ద, శ్లేష, కథా, అర్థములనెడి నాలుగు స్తబకములుగా వింగడించి యున్నారు. ఈయన మాళవదేశాధిపతి యొక్క మహామాత్యుడైన వాగ్భటుని కుమారుడు. ఆశుకవిత్వసిద్ధి కొరకు ఈ కవికల్పలతను రచిస్తున్నట్లు పేర్కొన్న దేవేశ్వరుడు అనేక లక్షణ గ్రంథాలను, వాల్మీకాది కవిపుంగవులను అనుసరించి ప్రాచీన సంప్రదాయ కవిత్వపద్ధతులకు అనుగుణంగా వ్రాస్తున్నట్లు తెలియజేశారు. ఇందులోని నాలుగు స్తబకాలను 22 కుసుమాలుగా వింగడించారు. ఉదాహరణకు శబ్దస్తబకము ఛందోభ్యాస, సామాన్యశబ్ద, వర్ణస్థితి, అనుప్రాస అను కుసుమాలుగా విభజింపబడినది.

ఛందోభ్యాస కుసుమాన్ని ప్రారంభిస్తూ లక్ష్మీదేవి నామాలను ఇలా కూర్చారు,

**శ్రీర్లక్ష్మీః కమలా పద్మాలయా చ హరివల్లభా ।**
**దుగ్ధాబ్ధితనయా క్షీరసాగరాపత్య మిత్యపి ॥**
**క్షీరపాథోధితనయేత్యేవ మేకాక్షరాధికమ్ ॥** – ఇందులో అన్నీ లక్ష్మీదేవి పేర్లే అయినా ఒక్కోదానిలో ఒక్కో అక్షరం అధికంగా ఉన్నాయి. మాత్రాగణములతో పద్యం అల్లుతున్నప్పుడు ఇవి అక్కరకు వస్తాయి. పద్యం వ్రాయడానికి గల ఒక సామాన్య నియమాన్ని చెబుతూ "ఆదౌ సాధ్యపదం స్థాప్య శేషం కుర్యా ద్విశేషణైః" అన్నారు. అనగా పద్యంలో చెప్పదలచిన వాక్యాన్ని అనుకోవాలి. అందులోని కర్త, కర్మ, క్రియలకు అవసరం మేరకు విశేషణాలు జోడించాలి. అప్పుడు పద్యశరీరం నిండుతుంది.

ఉదాహరణకు 'రాముడు రావణుని చంపెను' అన్నది చెప్పదలచుకున్న విషయం అనుకొందాం. ఈ వాక్యాన్ని మరింత పెద్దది అనగా సీసపద్యంలో చెప్పాలి అనుకొంటే అప్పుడు...

**రణరంగభీముడు – రవివంశయోధుడు**
**ఖరదూషణాది రాక్షసవిదారి**
**వానర భల్లూక వాహినీయుక్తుడు**
**కోదండరాముడు క్రుద్ధుడగుచు...** అంటే రామునియొక్క యుద్ధసంబంధ విశేషణాలతో సీసం రెండు పాదాలు నిండినది.

అటుపై **బ్రహ్మకులోద్భూతు రక్షఃప్రవృత్తుని**
**సీతాపహర్తను శీలదూరు**
**త్రైలోక్యతోషలతాలవిత్రుని, జటా**
**యువుతెక్కలను గోసియున్నవాని...** ఇక్కడికి రావణుని విశేషణాలు సందర్భోచితంగా, అతనిని చంపడానికి అనుకూల కారణాలుగా సీసంలో రెండు పాదాలు నిండాయి. ఇంకా నామవాచకం రాలేదు.

ఇప్పుడు ఎత్తుగీతి 'రావణుని...' ఇలా కర్మవాచకంతో ప్రారంభిస్తే
**రావణుని లోకభీకర రణమునందు**
**గరుడ గంధర్వ కిన్నర సురలు పొంగ**
**స్వీయకోదండముక్తవిశిష్టబాణ**
**ఘాతమున జంపె నరిభయంకరుడునగుచు...** అనడంతో పద్యం ముగిసిపోతుంది. అనగా పద్యశరీరాన్ని అనుసరించి గణ, యతి, ప్రాస మర్యాదలను గుర్తించి కర్తృవిశేషణాలను, కర్మవిశేషణాలను, క్రియావిశేషణాలను చేర్చుకోవాలని దేవేశ్వరుడు సూచించాడు. విశేష్యములకు విశేషణాలను లేదా ఉపమానములను చేర్చునపుడు సాదృశ్యవాచకములు అవసరం కనుక వాటిని పేర్కొన్నాడు. బంధు, చౌర, సుహృత్, వాదీ, కల్ప, ప్రఖ్య, ప్రభ, సమ, దేశీయ, దేశ్య, రిపు, ఆహ, సోదర మొదలగు శబ్దాల పద్యాయపదాలు; ఇవ, వత్ మొదలగు అవ్యయాలు సాదృశ్యవాచకములు.

**ఇందుబంధు = చంద్రునితో సమానమైన, కుందవాదీ = మొల్లమొగ్గతో సరియగు, శేషదేశ్య = శేషునితో సమానమైన, బిసాభ = మృణాలముతో సరియగు...** అంటూ ప్రయోగించాల్సిన విధానాన్ని తెలియజేశారు.

శబ్దస్తబకమునందు ఒక్క అక్షరంమొదలుకొని ద్వ్యక్షర, త్ర్యక్షర, చతురక్షర, పంచాక్షర, షడాక్షరాది పదములు తెలియజేశారు. ఉదాహరణకు **స్ఫుటం = స్పష్టమైన, వికసించిన; స్ఫూర్జత్ = ధ్వనిచేయుచున్న; స్ఫురత్ = అదురుచున్న, ప్రకాశించుచున్న; స్ఫారం = దట్టమగు;** (మిగతా 13వ పేజీలో)

# 'అవధాని'గా తొలి తెలుగు ప్రధాని!

**- డాక్టర్ వి. వి. రామారావు.**

(గత సంచిక తరువాయి)

"చిత్తైకాగ్రం అవధానం" అని నిర్వచించిన (కావ్యాలంకార పుట 3-17) వామనుడి మాట పి.వి. అనబడే 'వామనుడి'కి నచ్చింది.. అలా ఆయన రాజకీయ రంగంలో సహస్రావధానాలెన్నో చేశారు.. ఈ అంశాన్ని 1996లో హైదరాబాద్‌లో నిర్వహించబడిన మాడుగుల నాగఫణి శర్మ గారి సహస్రావధానానికి ముఖ్యఅతిథిగా హాజరైన పి.వి. దేశప్రధానిగా తను చేస్తున్నది కూడా సహస్రావధానమే అని చమత్కరించి సభలో నవ్వులు పువ్వులు పూయించారు.

ఆనాటి సభ ఎంతో రసవత్తంగా సాగింది.. సభకు డా. సి.నారాయణరెడ్డి గారు అధ్యక్షత వహించారు. విద్యాశాఖ మంత్రి పి.వి. రంగారావు, రాజ్యసభ సభ్యులు వి.రాజేశ్వరావు గారు ఆంధ్ర వ్యాస ఏలూరిపాటి అనంతరామయ్య ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. పి.వి. పృచ్ఛకుని పాత్ర పోషించారు. ఆయన ఇలా ప్రసంగించారు..

"అధ్యక్షా, అవధాని గారు. నారాయణరెడ్డి గారు.. పెద్దలారా! ఈ రోజు మీ కోరికను మన్నించి ఒక ప్రశ్న అవధాని గారికి వేయమని చెప్పారు.. ఇదెలా వుందంటే గడ్డి వాములో ఒక సూది గనక పడితే దాన్ని బయటికి తీసినట్లుంది.. ఎటుచూసినా నిద్రావస్థలో కూడా, ప్రశ్నలే ప్రశ్నలు కనబడుతున్న నాకు ప్రతి మానవుడు ఒక ప్రశ్నగా, జవహర్ లాల్ నెహ్రూ చెప్పినట్లు సమస్యగా ఈనాడు పరిణమించిన సందర్భంలో నేను ఇన్ని ప్రశ్నలోనుంచి ఏ ఒక్క ప్రశ్ననైన వేరుచేస్తే తక్కిన వాటికి అన్యాయం చేసిన వాడినవుతాను.. (సభలో చప్పట్లు నవ్వులు)

అందుకని కవికి తన భావననుసరించి, ఈ క్షణంలో ఆయన మనస్థితి ననుసరించి, అన్నిటికన్న పెద్ద ప్రశ్న ఏది స్ఫురిస్తుందో, దానిపైన ఆయన జవాబు చెబితే బాగుంటుంది.. ( సభలో చప్పట్లు నవ్వులు)

తరువాత నాగఫణి శర్మ గారు గళాన్ని సవరించుకొని ఆటవెలదిలో..

సకల భారతమును శాసింపగల రేడు
ప్రశ్న వేయకుండ ప్రశ్న వేసె
ప్రశ్న ఏది నాకు ప్రశ్న సమూహాన
ప్రశ్న మిగిలె నాకు ప్రశ్న గాను ..

అని తన మనస్థితిని విన్నవించాడు.. తదుపరి గేయ రూపంలో పి.వి. గొప్పతనాన్ని ప్రశంసించాడు. ప్రశ్న ఏం వేయాలో తేల్చలేకపోయాడు అవధాని.



అనంతరం పి.వి. ప్రసంగిస్తూ "శర్మ గారి అవధానాన్ని పూ ర్తిగా ఆస్వాదించలేకపోయినందుకు, నాకు చాలా విచారంగా ఉన్నది. మన దగ్గర అనేక బాధితులుంటారు. వరదబాధితులు, కరువుబాధితులు అని.. నేనేమో సమయాభావబాధితుడిని.. (సభలో చప్పట్లు) నేను చేస్తున్నది అవధానమే! ఎక్కడి గోవా, ఎక్కడ హైదరాబాద్, కరీంనగర్‌లో పెళ్లి, మళ్ళీ రాత్రి ఢిల్లీ చేరడం అంటే ఇది అవధానం కన్న ఏం తక్కువకాదు, కాకపోతే ఇది చదువొచ్చినా రాకున్నా ఎవరైనా చేసేది.. ఆయన చేసేది వేరు, అది ఎంతో కృషి చేసిన విద్య.

మనదేశంలో కవిత్వం, కవితా పద్ధతులు రకరకాలుగా ప్రవహించింది.. మీకు తెలియని విషయం కాదు.. కానీ మన దగ్గర తెలుగులో, భావంతో పాటు పాండిత్యం, శబ్దాధిపత్యం లేకపోతే కవి పూర్తిగా రాణించలేదు.. ఇవి రెండూ నన్నయ్య కాలంనుంచి కూడా చూస్తున్నాం. హిందీ, బెంగాలు, మరాఠీ మొదలగు భాషలలో చిత్రకవిత్వం చూసాను.. ఒక శ్లేష వాడితేనే ఆ భాషల వారు ఆహా ఓహో అంటారు.. కాని రాఘవ పాండవీయం, యాదవ పాండవీయం వంటివాటిలో ఒకే textను రామాయణానికి, భారతానికి లేదా భాగవతానికి అన్వయించి రాసినటువంటి మహా మహులున్నారు.. అలాంటివి ఇతర భాషల్లో మాత్రం లేవు .. మన దగ్గర భావము, భాష సమతూకంలో చూశారు. అవధానంలో భాషాధిపత్యంతో పాటు ధారణ శక్తి ముఖ్యమైనది.. అన్నిటిని ఒకేసారి జ్ఞాపకం ఉంచుకోవడం. ఒకయన పూలు వేస్తుంటాడు, ఒకాయన గంటలు కొడుతుంటాడు, అడ్డదిడ్డం ప్రశ్నలు వేస్తుంటాడు.. ఇన్నింటికి ఏకాగ్రతతో సమాధానం ఇవ్వడం అవధాని గొప్పతనం. . మిగతా భాషల వారు ఇదెలా సాధ్యం అని అడిగారు కూడా.. మన తెలుగు నాట మాత్రం 300సంవత్సరాల నుంచి ఉన్న ఈ అవధానం ఇపుడు కొంచెం తగ్గింది.

అవధానంలో పాల్గొనే వారు కూడా పండితులు అయివుండాలి.. అవధాని చెప్పే జవాబులు సరైనవా కానీ అని నిర్ణయించే వారుండాలి.. అవధానిని ప్రశ్నలతో చికాకు పరుస్తుండాలి. మేం పార్లమెంటులో జవాబులిచ్చినట్లు అవధాని అన్నిటికీ తట్టుకోవాలి.. ఒక్కోసారి చమత్కారంతోపాటు, పృచ్ఛకుని తెలివితక్కువతనాన్ని

బయటపెడుతుండాలి.. దీనికి నిరంతరకృషి అవసరం.. ఎంతో సాధన చేయాలి.. ఈ అవధానం మన దగ్గర అంతరించిపోకుండా చూడాలి.. పిల్లలకు దీని గురించి చెప్పాలి.. శర్మ గారు కొందరికి కాస్త అప్రెంటిస్‌షిప్ కూడా ఇస్తే మంచిది.. బాల్యంలో ధారణ ఎక్కువగా ఉంటుంది.. నేనైతే ఒక పద్యం ఒకసారి చదవగానే వచ్చేది.. ఏకసంథాగ్రహి అంటారు.. అలా అయితే ధారణకు ఎలా ట్రైన్ చేయాలన్నది ముఖ్యం. అవధానాన్ని ఒక కళగా, ఒక సైన్సుగా తీర్చు దిద్దాలి. ఇపుడు కంప్యూటర్లు వచ్చాయి కనుక మెదడుకు ధారణకు పని లేదు. అయితే ఎంత టెక్నాలజీ పెరిగినా మనిషిని రీప్లేస్ చేయలేము. అయితే చదరంగం వంటి క్రీడలకు కంప్యూటర్లు వచ్చినట్లు అవధానానికి కూడా కంప్యూటర్ల టెక్నాలజీ ఉపయోగించాలి. మరుగుపడిపోకుండా అవధాన విద్యను కాపాడు కోవాలి" అని సందేశాత్మకంగా ప్రసంగం ముగించారు..

పి.వి.గారు చివరిదశలో ప్రముఖపత్రికా సంపాదకులు మాశర్మ గారు ఆధ్వర్యంలో, "కొప్పరపు కవుల కళాపీఠం" వారు ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్నారు. కొప్పరపు కవుల అవధాన ప్రతిభను కొనియాడారు. ఇదే వారి చివరి సభ.. పి.వి. జీవితాంతం రాజకీయాలలో తలమునకలుగా ఉన్నప్పటికి, అవధానాన్ని మాత్రం అంతరంగంలో ఎంతో అభిమానించి, ధారణాశక్తితో, సాహిత్యంలో కన్నా రాజకీయంలో మాత్రం అవధాని అని నిరూపించుకున్నారు. ప్రముఖ జర్నలిస్టు ఇన్‌సైడర్ అనువాదకుడు కల్లూరి భాస్కరంగారికి పి.వి. ఇచ్చిన ఇంటర్వ్యూలో పి.వి.ని "ఆలోచనల శతావధాని" అని పేర్కొన్నాడు (నమస్తే తెలంగాణ బుధవారం 12 అగస్టు 2020 పేజి6) అది అక్షర సత్యం!

కొందరు సాహిత్యంలో అవధానాలు చేస్తూ సామాజిక, రాజకీయ అంశాల్లో పృచ్ఛకులుగా ఉంటారు.. కానీ పి.వి. సాహితీ అవధాన సభలలో పృచ్ఛకులుగా పాల్గొని రాజకీయాల్లో ముఖ్యంగా ప్రధానిగా స్వపక్ష, విపక్ష పృచ్ఛకులతో అవధానాలు చేసిన మేధావి.

*(రచయిత గాయకులు, అనువాదకులు, ఆకాశవాణి వ్యాఖ్యాత.)*

(4వ పేజీ తరువాయి)

## డా. ఆశావాదిగారి అవధానాలు

ప్రత్యక్షర నిషేధంలో లభించిన ఈ వెసులుబాటును అందిపుచ్చుకొని 'గిల' అనడంలో 'రాగిల' అయింది. ఈ 'గి' కెంగన్నేడులోని 'కె'కి యతి మైత్రిగా అమరింది. దీన్నిబట్టి అవధాని పృచ్ఛకుని సామర్థ్యాన్ని పూర్తిగా చదివి, ప్రణాళిక రూపొందించు కొన్నట్లు అర్థమవుతుంది. అవధాని ఊహాశాలిత్వం, భాషాధికారం, వ్యాకరణ పరిజ్ఞానం, పద్య నిర్మాణ చాతుర్యం అన్ని ఏకకాలంలో ఈ పద్యం ద్వారా దర్శనమిస్తాయి. **(సశేషం)**

(8వ పేజీ తరువాయి)

## వేదాల్లో ఘనపాఠం...

సాహిత్య అవధానం భాషా వైదుష్యాన్ని, సృజనాత్మకతను ప్రదర్శిస్తే, వేదావధానం శబ్ద శుద్ధిని, అక్షర క్రమ నిబద్ధతను చాటుతుంది. రెండింటిలోనూ అంతర్లీనంగా ఉండేది 'అవధానం' అంటే 'సమగ్రమైన ఏకాగ్రత'.

**ముగింపు:**

ఘనపాఠి యొక్క వేద పఠనం నుండి అవధాని యొక్క ధారణా శక్తి వరకు చూస్తే, భారతీయ మేధో సంప్రదాయం శబ్దానికి, స్మృతికి ఎంతటి ప్రాముఖ్యత ఇచ్చిందో అర్థమవుతుంది. ఘనపాఠం అనేది కేవలం పద్యాల వల్లె వేయడం కాదు, అది ఒక జాతి తన చరిత్రను, సంస్కృతిని, జ్ఞానాన్ని విజ్ఞాన శాస్త్ర పరమైన పద్ధతులతో భద్రపరచుకున్న విధానం.

ఒక ఘనపాఠి వేద శబ్దాల స్వచ్ఛతను ఎలాగైతే కాపాడతాడో, ఒక గొప్ప కవి అవధాన ప్రక్రియలో తన ధారణా శక్తిని ప్రదర్శిస్తాడు. నిరంతర సాధన ఉంటే ఏ విద్యనైనా సాధ్యం చేసుకోవచ్చు. ప్రాచీన ఋషులు అందించిన ఈ పద్ధతులు నేటికీ అవధాన వికాసానికి అత్యుత్తమ మార్గదర్శకాలుగా నిలుస్తున్నాయి. వేద ఘన పాఠానికి, అవధాన విద్యకు జయహో. స్వస్తి.

(11వ పేజీ తరువాయి)

## నిఘంటు పరిజ్ఞానం

**ప్రాగ్ర్యం = శ్రేష్ఠమగు; ప్రాజ్యం = తరచగు; క్రమం = మనోహరమగు; మంక్షు = శీఘ్రమగు; ప్రౌఢం = నిపుణమైన; వల్గు = సుందరమైన; వల్గత్ = చలించుచున్న, నడచుచున్న; స్వైరం = స్వతంత్రముగ; ధుర్యం = శ్రేష్ఠమగు; రింఖత్ = జారుచున్న...** అని రెండక్షరాల పదాలను ఇచ్చారు. చాలాసార్లు యతిప్రాసలకో, పాదపూరణకో ఈ పదాలు ప్రయోగిస్తుంటారు. వీటి అర్థం తెలుసుకోవడం వల్ల సార్థకంగా ప్రయోగించవచ్చు. స్ఫూర్జత్, రింఖత్, ప్రాగ్ర్యం వంటివి దుష్కరప్రాసలను దాటడానికి ఉపయోగపడే పదాలు.

కొన్ని శబ్దాలు సంస్కృతప్రాకృతములందు సమానరూపము గలవి ఉన్నాయని వాటిని పేర్కొన్నారు.

**ఉదా: హారాహార విహార సారసరసాః సంభోగరాగాసురాః
సహారామర వారవారణగణాష్టంకార తారాకరాః ।
లోలల్లోల విలోల వాయసహరా హంకార హీరాంకురా
నీహారోరగరాగ తాలతరళా గోవింద కందోదరాః ॥**

వీటిలో నిరోష్ఠ్యములను ప్రత్యేకంగా పేర్కొన్న కారణం చేత అవి చిత్రకవిత్వరచనకు ఉపకరిస్తాయి.

## తెలంగాణా ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ వారి ఆధ్వర్యవంలో రవీంద్రభారతిలో జరిగిన

## 1. శతావధాని చేపూరి శ్రీరాం గారి అష్టావధానం 4.5.2026

**సంచాలకులు:** సంగనభట్ల నరసయ్య

**నిషిద్ధాక్షరి:** చింతా రామకృష్ణారావు

**జానపద కళలు మనసంస్కృతి.**

శ్రీ(-)క(ళ)ర(మ) కం(ళ)జ(-)జ(డ)స(ద)తి(త)కిన్
(ల)ప్రాకా(ర)మ్యం(మ)బ(న)గు(-)క(ళ)వి(-)త్వ(-)రా(జ)శుల్
(ప)సు(గ)క(వ)ళల్..

కం. శ్రీకర కంజజ సతికిన్
ప్రాకామ్యంబగు కవిత్వ రాశుల్ సుకళల్
ప్రాకటమై జానపదము
సాకృతియై నిల్చు గాక సంస్కృతి నిల్పన్!!

**సమస్య:** కటకం వేంకటరామశర్మ

**సత్సాంగత్యము కూడు బెట్ట దకటా సర్వమ్ము లుప్తంబగున్**

వత్సా! చూడుమ యొక్కసారి కటువౌ ధ్వాంతమ్ము వెన్నాడగా
సత్సాంగత్యమనన్ దలంచెడు లసత్ సంపైక్య మార్గమ్మునే
ప్రోత్సాహమ్ముగ నెంచబోకు కనుమా భోగమ్ము లూహించు తత్
సత్సాంగత్యము కూడు బెట్ట దకటా సర్వమ్ము లుప్తంబగున్

**దత్తపది:** అష్టకాల విద్యాచరణ్

**మడి - గుడి - బడి - సడి పదములతో ప్రాచీన, ఆధునిక విద్యావిధానాలకి అన్వయిస్తూ స్వేచ్ఛా ఛందంలో...**

తే.గీ. చాటె రాబడి సూత్రమై నేటి చదువు
చూసి సాగుడి సంస్కృతి చోదనమున
ధర్మ మీసడించెడి వారుధరను గలరు
విద్య సేద్యపు మడికట్టి వెలుగు నింపు!!

**న్యస్తాక్షరి:** భానుమతి హట్టి

**1-1-రా, 2-2-డా, 3-3-నే, 4-8-దే / కరినించి విముక్తికై గజేంద్రుడు విష్ణువును పిలవటం, శార్దూలంలో.**

రాడా చూడడ విష్ణుమూర్తి విలసత్ భ్రాజిష్ణుడై జిష్ణుడై
రాడా కావగ నక్ర బంధమును నా ప్రారబ్ధముల్ దీర్చగా
రాడా నే డిటు రక్షణన్ సలుపగా రమ్యాకృతిన్ దాల్చియున్
రాడే వేడ్కగ చూడ డే జలమునన్ ప్రాణంబులన్ కావడే!!

**వర్ణన:** ఆరవల్లి శ్రీదేవి

**నృసింహవర్ణన శార్దూలంలో**

అక్షోభ్య ప్రతిమాన శౌర్య ధృతి వక్షోజుండె భీతిల్లగాన్
దీక్షాదక్షత భక్తపాలన కళా దీప్తత్వ సంభూతిలో
శిక్షించెన్ నరసింహ రూపమున కశ్చిన్ మూర్ఖ దైత్యాధిపున్
రక్షించెన్ ప్రియబాలకోత్తముని ప్రహ్లాదాఖ్య భక్తాగ్రణిన్!!




**చిత్రానికి పద్యం:** గెంటేల జగదీష్ చంద్ర కుమార్

**శార్దూలంలో**

శ్రీకామేశ్వరిలోకమాతతనురోచీవర్ణ సౌందర్య,శ్రీ
రాకాచంద్ర వికాస హాస వదనా రాజీవ నేత్రద్వయీ
శ్రీకారంబొనరించిమా దురితముల్, చెండాడి కాపాడ, రా
వాకారుణ్య గుణా వినోద లలితా వాగీశ్వరీ అంబికా!!

**ఆశువు:** కౌండిన్య తిలక్

**1. ఓటు యొక్క ప్రాముఖ్యం**

ప్రజల స్వామ్యమ్ము నిలిపెడి భాషయగుచు
ఎన్ని కలలను నడిపించు ఎన్నికలవి
చేటు తెచ్చెడి నాయక శ్రేణులందు
ఓటది సుదర్శనమ్ముగ పోటు పొడుచు!!

**2. యుద్ధం వద్దు శాంతి ముద్దు**

వద్దు పెద్దన్న యుద్ధమ్ము వద్దు వద్దు
హద్దుదాటుట నెవరికి ముద్దుకాదు
ప్రజల బాధలు పెరుగును వాస్తవముగ
శాంతి గోరుచు సాగుటె సౌఖ్య పథము!!

**అప్రస్తుత ప్రసంగం:** అవుసుల భానుప్రకాశ్

## 2. ముత్యంపేట గౌరీశంకర శర్మ గారి అష్టావధానం 4.5.2026

**ముఖ్య అతిథి:** డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి
IAS; సంచాలకులు భాష సాంస్కృతిక శాఖ.

**సంచాలకులు:** శ్రీ మరుమాముల దత్తాత్రేయ శర్మ గారు.
అవధాన విద్యా వికాస పరిషత్ అధ్యక్షులు, భాగ్యనగరం.

**నిషిద్ధాక్షరి:** డా. ముదిగొండ అమరనాథ శర్మ

**99 రోజుల ప్రజా కళల సంబరాలు నిర్వహణ గురించి.**

కం. శ్రీమంతము నీసభలే
ధీమగ కవి కళయు మరియ దీవ్యత్ కృషియై
ప్రామాణ్యముగా నిలిచె న
సామాన్యము ప్రజలకళలు సంతోష మిడెన్.

**సమస్య: మాచవోలు శ్రీధరరావు**

**వరుడు ధరించె పూలజడ వాసిగ పెండ్లి ముహూర్త మందునన్.**

సురుచిర భావనామయ సుశోభిత మంగళ వేదికాస్థలిన్.
సురులును యక్షకిన్నరులు సుందరమైన విలాసినీ మణుల్
మురియుచు పార్వతీశ్వరుల మోదముతోడ నలంకరింప నీ
శ్వరుడు ధరించె పూలజడ వాసిగ పెండ్లి ముహూర్త మందునన్.

**దత్తపది: కొవ్విడి వేంకట రాజారావు**

**మతి, గతి, రతి, కృతి అన్యార్థంలో - సోషల్ మీడియా లో వచ్చే అవాస్తవ వార్తలు గురించి... స్వేచ్ఛా ఛందము**

కం. అర్థము సమ్మతి నుండదు
వ్యర్థపు సంగతుల కాలయాపన చేయన్
స్వార్థరతులై నెప్పుడు
తీర్థము నాకృతిగ బూని దినములు గడుపున్.

**వర్ణన: ఉప్పలపాటి కుసుమ కుమారి**

**వడియాలు - వడగండ్ల వాన.. శార్దూలములో.**

వయ్యారంబుగ వస్త్రవైభవముతో వాంఛించె కూష్మాండమున్
వియ్యాలోరికి పంపు కారణముతో విశ్రాంతితో శ్రద్ధతో
అయ్యారే వడియాలు బెట్టితినినే నయ్యో గనన్ వానలో
కుయ్యాలించుచు నేడ్చెనా వనిత నాకున్ భోగమున్ లేదొకో.

**శ్లోకానువాదం: చిటితోటి విజయ కుమార్**

**అనగ ననగ రాగ ....వినుర వేమ..**

ముహుర్ ముహుర్ భాషణేన
రాగమాయాతి సత్వరం
నింబో మధురతామ్యాతి
సాధనాత్ శృణు వేమన

6. ఛందో భాషణం: విద్వాన్ బైరపనేని పోతురాజు చౌదరి గారు
7. ఆశువు: శ్రీ భువనగిరి పురుషోత్తం గారు
8. అప్రస్తుత ప్రసంగం: శ్రీ రంగి సత్యనారాయణ గారు.

## ఏలూరు జిల్లా ఆగిరిపల్లిలో జరిగిన శతావధాని డా. పాలపర్తి శ్యామలానంద ప్రసాదు గారి చతుర్భాషాష్టావధానం

**సంచాలకులు: డాక్టర్ ధూళిపాల మహాదేవమణి**

**వర్ణన: ప్రాకృతం - నృసింహస్వామి పెళ్లిమేళం**

పచ్చక్ఖం సామికల్లేణమ్ నారా అణస్స తారిసం
ప ఉత్తో దుందుహీ సాహు సద్దో సో హోది సోహణమ్

ఛాయ: ప్రత్యక్షం స్వామి కళ్యాణం నారాయణస్య తాదృశం,
ప్రవృత్తో దుందుభిస్సాధు శబ్దో భవతి శోభనమ్

**వ్రాకట్టు (నిషిద్ధాక్షరి): అచ్చ తెలుగు -వేద ప్రశస్తి**

కం. తలతున్ తొనలై పనసల్
పలుదావుల్ పల్కు గొంతు పండగ నిచ్చున్
తొలి పలుకు లంద్రు వానిని
కలదే వానికిని సాటి కలిసి చదువుడీ

**దత్తపది: సంస్కృతం**

**భారతం పూరితం పూజితం రాజితం, భారత దేశ వైభవం**

భారతం చ సదా భూయాత్
పూజితంచ మహీతలే
రాజితం త్రిగుణాతీతం
పూరితమిహ భారతే

**సమస్య: ఆంధ్రం**

**రామబ్రహ్మ దయా విశేషమున శాస్త్ర గ్రంధి సన్యాయమౌ**

ప్రేమన్ వత్సలతా వరిష్ఠతను సద్వేదాంత సన్యాయతన్
సామీచీన్య సమన్వయం బొసగ శిష్య శ్రేణి మాణిక్యముల్
తామై ఆగిరిపల్లి పుట్టిరి అహంతన్ గౌతమాకారులౌ
రామబ్రహ్మదయావిశేషమున.....

**చిత్రాక్షరి: సంస్కృతం - రామ ప్రతిజ్ఞ**

సత్య ధర్మౌ సమాశ్రిత్య రామో జయతి సర్వదా
రామాయణ కథా సారః రామావతార కుంచికా

**ఆశువు: 1. శోభనాద్రి వ్యాఘ్రనరసింహుడు**

నవనారసింహములలో
వివిధములగు రూపములను వీక్షింపదగున్
స్తవనీయమిందు చూడగ
నవమైనది గాదె వ్యాఘ్రనరసింహమిటన్

**2. రావణ కాష్ఠం: ప్రాకృత భాషలో**

రావణస్స ప్పహావేణ పరిహూదో హుదాసణో
సామి బాణేన సందద్ధం కాట్ఠే దహాది మణ్ణుణా

ఛాయ: రావణస్య ప్రభావేణ పరిభూతో హుతాశనః
స్వామి బాణేన సందగ్ధం కాష్ఠే దహతి మన్యునా

**7. పురాణం**

**1. కమలాక్షు నర్చించు 2. నానా సూన వితాన..**

**8. అప్రస్తుత ప్రసంగం**

**1. కుంతీపుత్రో వినాయకః**

**2. బ్రహ్మచారీ శతమర్కటః**

# పూరణతోరణం

నిర్వహణ: 'అష్టావధాని' కంది శంకరయ్య

## సమస్య

"దేహము నిత్యమ్మటంచు దేశికుడనియెన్"

**తపస్వి, విజయవాడ**

ఆహాహాయని పెద్దలు
స్నేహితులందరు పొగడగ నిఖిలమునందున్
సాహిత్యవిషయముల సం
దేహమునిత్యమ్మంటంచు దేశికుడనియెన్.

**తూములూరు శేషయ్య శాస్త్రి, హైదరాబాదు**

మోహము వీడుము, నమ్మకు
దేహము నిత్యమ్మటంచు, దేశికు డనియెన్,
దేహ మన దహన మగునది,
వాహనమే యిది బ్రతికిన వరకున్ యిలలో.

**రాకుమార, గోదావరిఖని**

మోహపుచింతనతో వి
ద్రోహపుచర్యలకెగబడు దుర్గంధంబౌ
దేహముగలవారికి సం
దేహము నిత్యమ్మటంచు దేశికుడనియెన్.

## దత్తపది

'మూడు - ఆరు - ఏడు - పది' పదాలను ప్రయోగిస్తూ భారతార్థంలో స్వేచ్ఛాఛందంలో పద్యం

**ఆరవల్లి శ్రీదేవి, హైదరాబాదు**

తే.గీ. మృత్యువది మూడు సమయమ్ము నెత్తిజేర
ద్రౌపదినినీడ్చ కౌరవుల్ దయయె లేక
నారుబయట నేడ్వగజేసె నాతి వేడ
నేడు గడయౌచు కృష్ణుండు కీడు బాపె!

**కటకం సూర్యనారాయణ మూర్తి, బెంగుళూరు**

ఉ. మూడును కీడు మేల్కొనక మూఢునివై చరియింపబోకుమా
వీడిన పంతమారు గద వేరిమి కీలలు పోరు దూరమౌ
నేడు తరాల వారలకు నెంతయు మేలగునో సుయోధనా
పాడిగ పాలు పంచుమిక భావ్యముగా పదిమంది మెచ్చగా

**కవుతా రామకృష్ణ**

తే.గీ. మూడుకనులవానిఁ గొలిచి పొంది వరము
నేడు తురగముల రథము నెక్కు వాని
పట్టిని దునిమెఁ గ్రీడి, ద్రౌపదికచముల
రక్తమారు లోపుఁ బ్రచండ రణమునందు

**జి. శ్రీకాంత్, విజయనగరం**

తే.గీ. మూడు మునకలేసి కిరీటి మునిగ మారె
పరువమున నలరారు సుభద్ర వలచె
యేడడుగులతో యిరువుర నేక పరచి
సాగనంపెను పదిలము సత్యవిభుడు.

**జి. శ్రీనాథ్, కోడూరు, అన్నమయ్య జిల్లా**

ఉ. మూడు శరంబులన్ గొనుచు ముచ్చట తీరగ మత్స్యయంత్రమున్
నీడను జూసి కొట్టవలె నేర్పు నకున్ నలరారు లోకమే
వేడుకతో వరించు ఘనవీరుడె యేడుగడన్ లతాంగికిన్
చేడియ ద్రౌపదిన్ సతిగ చేకొనరేయనె యజ్ఞసేనుడున్.

**తపస్వి, విజయవాడ**

తే.గీ. కౌరవులకు మూడుచునుండె కాలమింక
నీవు సుమతివి ఆ రుక్మిణివలె భువిత
ఏడు పన్నది లేక హాయిగను జరుగు
ద్రౌపది నిజంబు నా వాక్కు తప్పదింక.
(రాయబారానికి వెళుతూ కృష్ణుడు ద్రౌపదితో..)

**రాకుమార, గోదావరిఖని**

తే.గీ. మోసకారులకాలంబు మూడునటుల
పరమపూజ్యులయునికియు పదిలపడగ
ఆరుబయలును యశమువిహారమొంద
ఏడుగడయు కొమరుల కాపాడుగాక.!
(అజ్ఞాతవాసకాలంలో- కుంతితో శ్రీకృష్ణుడు)

**కమిటీ నిర్ణయం ప్రకారం పూరణపద్యములు ఎంపిక చేయడమైనది.**

**సమస్య:** పుత్రునితో హిరణ్యకశిపుం డనె విష్ణువొకండె దైవమౌ

**దత్తపది:** వాన - జల్లు - ముసురు - వరద
పై పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ వేసవి తాపాన్ని వర్ణిస్తూ స్వేచ్ఛాఛందంలో పద్యం వ్రాయండి.

(పూరణలు **15 జూన్ 2026** లోపు **7702121376** ఫోన్ నంబరుకు పంపాలి)

# పద్యకవిత్వము సాధుప్రయోగాలు - 9

- 'అష్టావధాని' చిటితోటి విజయకుమార్

## సమాసాలలో సంధులు - కొన్ని విశేషాలు

తత్సమ సమాసాల్లో సంధి నిత్యం, అది ఐచ్ఛికం కాదు. అంటే సమాసం చేసినప్పుడు నియమిత సంధి కార్యాలు తప్పక జరగాలి. లోకవ్యవహారంలోను, రచనల్లోను మనకు తెలియ కుండానే దొర్లే కొన్ని దోషాలను, వాటి వెనుక ఉన్న వ్యాకరణ సూత్రాలను పరిశీలిద్దాం.

**1. జశ్త్వ, చర్త్వ సంధులు:** "విరాట్ రూపం" అనేది విశేషణ పూర్వపద కర్మధారయ సమాసం. ఇక్కడ జశ్త్వసంధి నియమం ప్రకారం వర్గ ప్రథమాక్షరానికి (ట్) హల్లులు పరమైనప్పుడు అది అదే వర్గ తృతీయాక్షరంగా (డ్) మారుతుంది. కాబట్టి "విరాడ్రూపం" అని ప్రయోగించాలి, "విరాట్ రూపం" అని విడదీయకూడదు.

అయితే, "విరాట్ స్వరూపం" అన్నప్పుడు 'స్' పరమైంది. శ, ష, స లు పరమైనప్పుడు పూర్వమందున్న వర్గ 1, 2, 3, 4 అక్షరాలు వర్గ ప్రథమాక్షరాలుగానే ఉంటాయి. దీనిని 'చర్త్వసంధి' అంటారు. అందుకే ఇది "విరాట్ స్వరూపం" గానే ఉంటుంది తప్ప "విరాడ్ స్వరూపం" కాదు.

**2. కాలవాచక పదాలు:** సమయాన్ని చెప్పేటప్పుడు సంధి చేయడం అనివార్యం. ఉదాహరణకు, ఒకటిన్నర గంటను "సార్ధ ఏకవాదనం" అనకూడదు. వృద్ధిసంధి జరిగి "సార్థైకవాదనం" కావాలి. కొందరు స్పష్టత కోసం "సార్ధ-ఏకవాదనం" అని వాడుతుంటారు, కానీ సంధి రూపమే వ్యాకరణబద్ధం.

**3. మృన్మయ - మృణ్మయ?:** "మృత్ + మయ" అనే సమాసంలో 'మయట్' ప్రత్యయం వల్ల అనునాసిక సంధి నిత్యం. తకారానికి నకారం వచ్చి "మృన్మయ" అవుతుంది. సాధారణంగా రేఫ, ఋకారాల తర్వాత వచ్చే నకారం 'ణ'గా మారుతుంది (ణత్వం). కానీ అష్టాధ్యాయి లోని త్రిపాది సూత్రాల ప్రకారం, ణత్వ ప్రకరణం కంటే అనునాసిక సంధి తర్వాత వస్తుంది కాబట్టి ఇక్కడ ణత్వం అసిద్ధం. అందుకే "మృన్మయ" సరైన రూపం, "మృణ్మయ" కాదు.

**4. మాసాభ్యంతరం:** "నెలంతా చదివాడు" అనే అర్థంలో "మాసపర్యంతం" అని వాడటం అంత సమంజసం కాదు. "మాససమాప్తి" అంటే నెల ముగియడం. "నెల లోపల/నెల వ్యవధిలో" అనే అర్థానికి "మాసాభ్యంతరం" (మాస + అభ్యంతరం - సవర్ణదీర్ఘ సంధి) సరైన ప్రయోగం.

**5. నకారాంత శబ్దాలు:** మహిమను వర్ణించేటప్పుడు "మహిమావర్ణనం" అనడం తప్పు. 'మహిమన్' నకారాంత శబ్దం. సమాసం చేసేటప్పుడు నలోపం జరిగి "మహిమవర్ణనం" అవుతుంది.

**6. తుగాగమ సంధి:** "అవధాన ఛాత్రులు" అనే సమాసంలో తుగాగమం తప్పనిసరి. అవధాన + ఛాత్రులు → అవధాన త్ + ఛాత్రులు (తుగాగమం), అవధాన త్ + ఛాత్రులు→అవధాన చ్ + ఛాత్రులు (శ్చుత్వ సంధి) అంతిమంగా "అవధానచ్ఛాత్రులు" అని వ్రాయాలి.

**7. మహా VS మహత్:** "గొప్ప ఉపకారం" అనే అర్థంలో (సమానాధికరణం) 'మహత్' శబ్దంలోని తకారానికి 'ఆ'కారం ఆదేశమై "మహా" అవుతుంది. అప్పుడు గుణసంధి జరిగి "మహోపకారం" అవుతుంది. వ్యధికరణంలో (అంటే రెండు పదాలు వేర్వేరు విభక్తులలో ఉన్నప్పుడు - ఉదా: గొప్పవాని యొక్క ఉపకారం), జశ్త్వ సంధి జరిగి "మహదుపకారం" అవుతుంది.

**అలాగే "మహాశ్చర్యం", "మహదాశ్చర్యం" విషయంలో:** పుంలింగంలో 'మహాన్ ఉపకారః' → మహోపకారః. నపుంసక లింగంలో (ఆశ్చర్యం) 'మహత్ ఆశ్చర్యం' → జశ్త్వ సంధి వల్ల మహదాశ్చర్యం అవుతుంది. సాధారణ కర్మధారయంగా తీసుకుంటే 'మహా + ఆశ్చర్యం' → మహాశ్చర్యం (సవర్ణదీర్ఘ సంధి) కూడా సాధువే.

**8. సవివరం VS సవివరణం:** "వివరం" అంటే రంధ్రం అని అర్థం. కనుక "సవివరంగా చెప్పాను" అనే అర్థంలో "సవివరణం" (వివరణతో కూడినది) అనడం సముచితం.

**9. ప్రాతిపదిక రూపాలు:** సమాసంలో పదాల మూలరూపాన్ని (ప్రాతిపదికను) వాడాలి. "వ్యాఖ్యాత వివరణం" కాదు → "వ్యాఖ్యాతృ వివరణం". "మాతా స్వరూపం" కాదు → "మాతృ స్వరూపం".

**10. పూర్ణోదరం:** "కడుపు నిండా" అనే అర్థంలో "ఉదరపూర్ణం" అనకూడదు. "విశేషణం విశేష్యేణ బహుళం" అనే సూత్రం ప్రకారం విశేషణమైన 'పూర్ణ' శబ్దం ముందు రావాలి. అందుకే "పూర్ణోదరం" (పూర్ణ + ఉదరం - గుణసంధి) అనాలి.

**11. నిరపరాధః:** "అపరాధి" అనవచ్చు కానీ "నిరపరాధి" అనకూడదు. 'నిర్గతః అపరాధః యస్మాత్ సః' అనే బహువ్రీహి సమాసంలో 'నిర్ + అపరాధ' కలిసి "నిరపరాధుడు" (నిరపరాధః) అవుతుంది. ఇక్కడ 'ఇన్' ప్రత్యయం చేరదు.

**12. సుగంధి ద్రవ్యాలు:** "సుగంధ ద్రవ్యాలు" అనేది వాడుకలో ఉన్నా, వ్యాకరణ రీత్యా తప్పు. పాణిని సూత్రం ప్రకారం (గన్ధస్యేదుత్పూతి...) 'సు' అనే ఉపసర్గ 'గంధ' శబ్దానికి చేరినప్పుడు అది "సుగంధి" అవుతుంది. కాబట్టి "సుగంధి ద్రవ్యాలు" అనడమే శాస్త్రీయం.

# కావ్యదోషాలు

డా॥ సూరం శ్రీనివాసులు

## నేయార్థం

మరొక పదార్థదోషం నేయార్థం. “కల్పితార్థం నేయార్థమ్” అని వామనుడు నేయార్థాన్ని నిర్వచించాడు. **“అశ్రౌతస్యాపి ఉన్నేయస్య పదార్థస్య కల్పనాత్ కల్పితార్థం నేయార్థమ్”** అని వామనుని వివరణం. కల్పితమైన అంటే కవికల్పితమైన అర్థంలో పదాన్ని ప్రయోగిస్తే అది నేయార్థమనే దోషమవుతుంది. ‘కల్పింపబడిన’ అన్నదానికి ‘అశ్రౌతస్య అపి’ అని విశేషణం. అంటే ఆ అర్థం అభిధేయం – అభిధావ్యాపారం చేత చెప్పబడినది కాదు అని. అయితే లాక్షణికమా? అని సంశయం కలుగవచ్చు. అభిధ చేత చెప్పబడని అర్థం లక్షణచేతనే సిద్ధిస్తుంది కాబట్టి. అంటే అదీ నిజమే. అయితే లక్షణ ప్రవర్తించాలంటే రూఢి కానీ, ప్రయోజనం కానీ ఉండాలి. నేయార్థంలో ఈ రెండూ ఉండవు. కాబట్టి ఇది లాక్షణికమైన కల్పన కాలేదు. అభిధా కాదు. లక్షణా కాదు. పదార్థం కాబట్టి వ్యంజనా కాదు. ఇవేవీ కాకుండా కేవలం కవి కల్పించుకొన్న అర్థంలో పదప్రయోగం కాబట్టి ఇది నేయార్థ దోషం –

**ఉదా –నలిని పంక్తివిహంగమనామభృత్త**
**నయవిశిష్టమ్ము ప్లవగసైన్యమ్ము పర్వ**
**తముల వర్షించుచుండగా దాని నబల**
**హీనత నులూకజిత్తు జయించెనపుడు**




ఇక్కడ పంక్తివిహంగమనామభృత్తనయ – ఉలూకజిత్ పదాలు నేయార్థదోషజుష్టాలు.

ఇక్కడ పంక్తి అంటే పది అనే అర్థం. ఇది అభిదేయమే. “పంక్తిర్వింశతిత్రింశత్...” మొదలైన పాణిని సూత్రం ద్వారా పంక్తి పదం పది అనే అర్థంలో నిపతితం. ‘విహంగమ’ పదం మాత్రం కవికల్పితార్థకం. ఎలా అంటే విహంగమ > పక్షి > చక్రవాకం > చక్ర... చక్రభృత్ = రథం, కాబట్టి పంక్తిరథ = దశరథ. ఆయన తనయుడు రాముడు. ఇక్కడ మొదటి మెలిక ఏమిటంటే విహంగమం అనే పదాన్ని – అది సాధారణ పక్షివాచకమైనా – ప్రత్యేకించి చక్రవాకపక్షి అనే అర్థంలో తీసుకోవడం. అది కవిముచ్చటయే. రెండవ మెలిక చక్రవాకంలోని వాకాన్ని తొలగించి తనకిష్టమైనట్లు చక్ర పదాన్నే తీసుకోవడం. దీన్ని నామైకదేశంలో నామం మొత్తాన్ని స్వీకరించటమని వ్యవహరిస్తారు. లోకవ్యవహారంలో పేరులోని కొంతభాగంతోనే ఆ పేరుగల వ్యక్తిని ఉద్దేశించటం, సంబోధించటం అనుభవసిద్ధమే. రెండవపదం ఉలూకజిత్తు. ఉలూకం అంటే గుడ్లగూబ. గుడ్లగూబకు మరొకపేరు కౌశికం. కౌశిక శబ్దానికి మరొక అర్థం ఇంద్రుడు. ఆ ఇంద్రుణ్ణి జయించినవాడు ఇంద్రజిత్తు. ఉలూక > కౌశిక > ఇంద్ర + జిత్తు = ఇంద్రజిత్తు. ఇక్కడ కౌశిక పదం ఇంద్రుడికీ, గుడ్లగూబకూ కూడా వర్తిస్తుంది కాబట్టి ఉలూక పదానికి కౌశికమని అర్థం చెప్పి, కౌశికాన్ని కౌశికుడు చేసుకొని, ఆ కౌశిక పదానికి అర్థమైన ఇంద్రుణ్ణి ఇక్కడకు లాగడం. ఇది కవికల్పన మాత్రమే. కాబట్టి ఇది నేయార్థమనే దోషం.

రామరాజభూషణుడు కావ్యాలంకారసంగ్రహంలో...

**ఇలఁ దన సంకేతంబున**
**నిలిపిన పద మెంచి చూడ నేయార్థంబౌఁ**
**బలుదేనెతిండిగమి నగు**
**నల సాగరకర్ణయాన యలకలనంగన్**

తన అభిధేయార్థంలో పదాన్ని నింపితే అది నేయార్థమట. తన అంటే కవియొక్క అని అర్థాన్ని చెప్పుకోవాలి. వాస్తవానికి పద్యంలో ఎక్కడా కవి ప్రసక్తి లేదు గాబట్టి ప్రక్కనున్న ‘సంకేతపదం’ ‘తన’ను ఆకర్షిస్తుంది కాబట్టి తన పదాన్ని సంకేతపదంతోనే సమన్వయించాలి. అప్పుడు లక్షణం కుదరదు. అందువల్ల తన అంటే తాను కవి అనియే అనివార్యంగా చెప్పుకొనవలసి వస్తోంది. ఉదా – సాగరకర్ణయాన – పదం. సాగరమంటే ఏనుగు చెవిలోని మద మని అర్థం. సాగరం కర్ణంలో గలది సాగరకర్ణం. అంటే ఏనుగు. ఏనుగుయానం (నడక) వంటి నడక గల స్త్రీ సాగరకర్ణయాన. ఈ ఉదాహరణంలో ఎక్కడా కవి కల్పించిన అర్థాలు లేవు. సాగర – కర్ణ – యాన శబ్దాలు మూడు అభిదేయమైన అర్థంలోనే ప్రయోగింపబడ్డాయి కానీ, ఆ అర్థాలను సాధించటంలో కవికల్పన మేదీ లేదు. అందువల్ల ఈ ఉదాహరణం కూడా సరియైనది గాదు. కాబట్టి కావ్యాలంకారసంగ్రహ వ్యాఖ్యాత సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రి

**చందమామఁ దన్ను సతిమొగంబు** –

అన్న ఆటవెలదిపాదంలో నేయార్థాన్ని ప్రదర్శించాడు. ‘తన్ను’ పదమిక్కడ జయించు అనే అర్థంలో వాడబడింది. అయితే ఆ అర్థం అభిధేయం కాదు. లక్షణను ఆశ్రయించటానికి రూఢీ కాదు, ప్రయోజనమూ లేదు. కాబట్టి విజయార్థంలో తన్ను

పదప్రయోగం నేయార్థదోషమే అని వారి నిర్ణయం.

రాధామాధవకావ్యంలోనుండి ఒక పద్యాన్ని చూద్దాం –

ప్రాణవల్లభ సత్కథార్ణవము నందుఁ
దెలవ హృదయాంబుజాతంబు దేలి తేలి
నిగుడు వాంఛాంతరంగముల్ నింగి ముట్ట
మోహరసపూరములలోన మునిగె నపుడు (2/109)

పై ఉదాహరణంలోని 'తన్ను' లాగానే ఇక్కడ కూడా 'నింగి ముట్ట' పదబంధం. నింగి ముట్టడమంటే ఆకాశాన్ని అంటడం అని అభిధేయార్థం. అయితే ఇక్కడ కోరికల విజృంభణం, అతిశయం వివక్షితార్థం. అది అభిధతో రాదు. లక్షణాబీజమూ ఇక్కడ లేదు. కాబట్టి ఇది నేయార్థదోషజుష్టమే అనవలసి వస్తుంది.

కానీ, అది యుక్తియుక్తం కాదు. అటువంటి ప్రయోగాలు దుష్టాలంటే అనంత సాహిత్యం దుష్టమైపోతుంది. నిరూఢలక్షణతో అభిధేయార్థంకంటె భిన్నమైన అర్థాన్ని లక్షణాబీజం లేకపోయినా అందించే పదాలూ, పదబంధాలూ ఉంటాయి. ఆనందవర్ధనుడు ధ్వని లక్షణల భేదాన్ని చూపిస్తూ –

రూఢా యే విషయేఽన్యత్ర శబ్దాః స్వవిషయాదపి ।
లావణ్యాద్యాః ప్రయుక్తాస్తే న భవన్తి పదం ధ్వనేః ॥
(ధ్వన్యాలోకం 1/16)

ఇక్కడ లక్షణకన్నా ధ్వని భిన్నమని చెప్తున్నాడు ఆనంద వర్ధనుడు. అయితే నిరూఢపదాలు లావణ్యాదులు ధ్వనిలో చేరవన్నారు కానీ సాధారణలాక్షణికాలూ కావు. అవి నిరూఢాలు. అంటే అక్కడ వాటి అర్థం అభిధార్థంలాగే నిరూఢమై ఉంటుంది. ప్రయోజనప్రసక్తి లేదు. అందువల్ల నిరూఢలక్షణ చేత సిద్ధించే అర్థాలను నేయార్థదోషంగా భావించకూడదని ఆనందవర్ధనుడూ, మమ్మటుడు కూడా భావించారు. కాబట్టి రాధామాధవకవి ప్రయోగం దోషజుష్టం కాదు.

మమ్మటుడు కావ్యప్రకాశంలో దోషప్రకరణంలో నేయార్థ నిర్వచనవృత్తిలో...

నిరూఢాలక్షణాః కాశ్చిత్ కాశ్చిత్ సామర్థ్యాదభిధానవత్ ।
క్రియంతే సాంప్రతం కాశ్చిత్ కాశ్చిన్నైవత్వశక్తితః ॥

అని కొన్ని నిరూఢలక్షణాలు అభిధావృత్తి అన్నట్లే అర్థాన్ని అందిస్తాయన్నాడు. పదబంధాలూ, జాతీయాలూ ఇటువంటివే. ఇవి అభిధేయాలు కాకపోయినా కవికల్పితాలు కాదు. నిరూఢాలు మాత్రమే. అటువంటి తావుల ఈ దోషం లేదు. **"రథాంగపాణి రక్షోభ్యః సర్వప్రహరణాయుధః"** అని విష్ణుపురాణఫలశ్రుతిలోని రథాంగపాణి పదం కూడా చక్రపాణి అనే అర్థంలో రూఢం కాబట్టి 'విహంగమనామభృత్తు' వలె రథాంగపాణి పదం దోషజుష్టం కాదు.

తెలుగులో రెండు ప్రసిద్ధపద్యాలు సంవాదరూపంలో ఉన్నాయి. అవి –

పర్వతశ్రేష్ఠపుత్రికాపతివిరోధి
యన్నపెండ్లాము అత్తను గన్నతల్లి
పేర్మి మీరిన ముద్దుల పెద్దబిడ్డ
సున్నమించుక తేగదే సుందరాంగి!

శతపత్రంబుల మిత్రుని
సుతు జంపిన వాని బావ సూనుని మామన్
సతతము దాల్చెడు నాతని
సుతు వాహన వైరి వైరి! సున్నంబిదిగో.

ఈ పద్యాలలో పాఠభేదాలు చాలా ఉన్నాయి. పాఠాంతరాలు దొరుకుతూనే ఉంటాయి. వాటి ప్రసిద్ధికి అదే సాక్ష్యం.

ఈ పద్యాలలో రామరాజభూషణుని లక్షణం ప్రకారం నేయార్థదోష మున్నట్లు సాగరకర్ణయానలో లాగా. కానీ ఆ లక్షణం సరి కాదని ముందే చెప్పాం. కాబట్టి ఇక్కడి అర్థం కవికల్పితంలా కనిపిస్తున్నా – ఇక్కడి గొలుసు కవికల్పితమే కానీ పదాలు కానీ పదార్థాలు కానీ కవికల్పితాలు కాదు. కాబట్టి దోషంలేదు.

## తటిల్లతలు

ప్ర: 'బ్రహ్మచారీ శతమర్కటః' అంటారు కదండీ ఈ ఆగిరిపల్లి వేద సంస్కృత పాఠశాలలో ఇంతమంది బ్రహ్మచారులు మీ చతుర్భాషాష్టావధానానికి వచ్చారు కదా వీరు ఒక్కొక్కరు 100 కోతులతో సమానమా?

స: ఆ మాటలోని అంతరార్థం తెలియక మీరు మీ వంటి వారు అపార్థం చేసుకుంటున్నారు. బ్రహ్మచారి అంటే విద్యార్థి. అతడు వేదాలు బ్రాహ్మణాలు ఉపనిషత్తులు ఉపవేదాలు శాస్త్రాలు మరెన్నో శాఖలు చదవాలి. కోతి ఒక శాఖ నుండి మరొక శాఖకు వందలాది చెట్ల పైకి వంద కోతులు దూకినట్లు అన్నీ చదవాలి. అందుచేత శ్రద్ధ కలిగిన బ్రహ్మచారి అధ్యయనపరుడై వేద విద్యలో అనేక శాఖల మీదికి దూకుతాడు కనుక బ్రహ్మచారి నూరు కోతుల వలె అనేక శాఖలపై సంచరించాలి అనే ఈ మాట పొడుపు కథ లాంటిది. ఇప్పటికైనా అసలు అర్థం తెలుసుకోండి. ఈ బ్రహ్మచారులను దీవించండి లేకపోతే మీరు అనుకున్నట్టే మనల్ని సత్కరిస్తారు.

– అచ్చతెలుగుఆంధ్రప్రాకృతసంస్కృతావధాని
**డా. పాలపర్తి శ్యామలానంద ప్రసాదు**

## ఈనెల అంశం: విశ్వ శ్రేయం కావ్యం

### పెనుకొండ రామబ్రహ్మం బెంగుళూరు

మానిని

భవ్య మనోహర భావ విభూష సుభాషిత మార్దవ వాహినియై
నవ్య రసోజ్వల నాంత్రము భక్తి వినమ్రత నిల్ప మనమ్ములలో
దివ్య సుశోభల దీపిలు భారతదేశపు సంస్కృతిఁ దెల్పు మహా
కావ్య పరంపర కాంచదె విశ్వ వికాసము శ్రేయపు కల్పకమై

ఉ. భారత గాథ రామ కథ భాగవతమ్ములు వేద సారమున్
బారముఁ జేర్చు బోధనలఁ బాటవ మొప్పఁగ రంగరించఁగన్
ధారగ నీతి సూక్తి పరి ధాత్రిని జీవన రీతి నేర్పఁగన్
గూరిమి మీర కావ్యములు కూర్చును శ్రేయము విశ్వమందునన్

మహా స్రగ్ధర

వరమౌ సత్కర్మ సద్భావ ధృతి విరియు భావాబ్ధి భాసిల్లుచుండన్
నెరవై విజ్ఞాన విద్యానిధిగ పరఁగ వాణీ కటాక్షంపు లబ్ధిన్
వరలెన్ గావ్యమ్ము లెన్నో ప్రభల ఝురిని విశ్వంబునన్ దీపిలంగన్
స్థిరమౌ భాగ్యమ్ముతో ధాత్రిఁ దరతరము లుత్కృష్టమౌ శ్రేయ మొందన్

మందాక్రాంత

అర్థంబొక్కింత పొదుగకనే ధ్యాస గుర్తింపుకై కీ
ర్త్యర్థంబే వ్రాయఁగఁ గృతులఁ బ్రీత్యాస్పదమ్మో! కనన్ భ
వ్యార్థాలంకార యుతపరి సౌభ్రాత్వ సందీప్తమై కా
వ్యార్థంబేపార యశమిడు శ్రేయమ్ము విశ్వమ్ముఁ గాంచున్

శా. అజ్ఞానమ్మును బారద్రోలు నిధియై హ్లాదంపు సంజాతమై
తజ్ఞుల్ వ్రాసిన కావ్య సంపదలు సద్భాగ్యంపు సంధాతయై
సుజ్ఞానమ్ము జనాళి పొందు పగిదిన్ శోభిల్ల విద్వత్తుతో
విజ్ఞానాబ్ధి యొసంగు శ్రేయము సదా విశ్వాభివృద్ధిన్ గనున్

### శిష్ట్లా వి ఎల్ ఎన్ శర్మ, హైదరాబాద్

కం. విశ్వమున మానవాళికి
నశ్వర మందక నిరతము నవ్యత నిలుపన్
విశ్వస్థితమై భాసిలి
శాశ్వతమై చరిత నొసగు సాహిత్య మదే!

కం. విజ్ఞానంబును బంచును
ప్రజ్ఞా పాటవము నిల్పి ప్రాజ్ఞుని జేయున్
సుజ్ఞాన పథము నందున
నజ్ఞానము బాపు కావ్య మరయగ నెపుడున్!

## ఖండశర్కర

**నిర్వహణ: శతావధాని ఎం.వి. పట్వర్ధన్**
**శతావధాని చేపూరి శ్రీరామ్**

కం. అక్షర మక్షయ మెప్పుడు
లక్షణ లక్ష్యముల నెంచు రాగామృతమై
రక్షణ నొసగును జాతికి
దక్షతగల కవుల రచన దారుల నెనయన్!

కం. తలపుల ప్రేమాస్పదమై
నిలుపును ధీశక్తి ధర్మనిరతిని బెంచున్
వెలయించు సామరస్యము
నలరించును గావ్యమెప్పు డానంద ఝురిన్!

కం. మానవ జీవన వేదము
కానగ నోపును స్పృశించ కావ్యము లందున్
మానవ జీవన రోదన
బోనాడు వివేచనాప్త పూతం బగుచున్!

### డా.శాస్త్రుల రఘుపతి, హైదరాబాద్

ఉ. కావ్యము కీర్తి సంపదల కారణమౌను జగత్తునందు సం
భావ్యమునైన 'రీతుల'ను వాక్సుధలందునఁ జాటిచెప్పగా
కావ్యమె మూలమౌను శుభ కాండములన్ సమకూర్చ నెంచుచున్
నవ్యములైన మార్గముల నైపుణి మీర రచింప గల్గినన్

ఉ. విశ్వహితార్థ బోధనల ప్రీతిని గూర్చెడు శైలులందునన్
నశ్వరమొంద గల్గని వినమ్రత రూపము దాల్చు కావ్యముల్
శాశ్వత కీర్తితో మనుచు సంపదలన్ దరి చేర్చుచుండునౌ
విశ్వప తీప్సితమ్ములుగ వృద్ధిని జెందు కృతార్థ సంస్కృతిన్

శా. ద్వత్సంస్తవనీయమైన కృతులన్ విజ్ఞాన సంస్ఫూర్తితో
సద్వాల్లభ్య విశేష భంగిమలతో సాహిత్య సంపన్నతన్
సద్వాక్యమ్ముల ప్రస్తుతిన్ గమనపున్ సారస్వత ప్రజ్ఞతో
విద్వాంస ప్రతిభన్ రచింప గనినన్ వేవెల్గులన్ చిందెడున్!

ఉ. రమ్య శుభాప్తి సత్ఫలిత రంజితమైన విశేష వృత్తముల్,
సౌమ్య విశిష్ట మార్గయుత సంహితమయ్యెడునట్టి ధర్మ వ

త్యామ్య హితార్థ సద్గుణ వికాసిత లక్ష్య విభాసితార్థులై
గమ్యము నెంచు కావ్యములు, క్రాంతి నొసంగుచు నిల్చి పోయెదున్

చ. కవితలు విశ్వమందున వికాసము గూర్చుచు నుండు సర్వదా
అవిరళమైన బోధనల నందగ జేయుచు మానవాళికిన్
ప్రవిమలమౌ హితమ్ములను వాక్సుధలందున తీర్చ గల్గినన్
స్తవముల నొందు చుందును ప్రసన్న మనః పరిపూర్ణ సంపదన్!

**ఆకుల శాంతిభూషణ్, వనపర్తి**

ఉ. ధర్మము నిల్పి లోకమున దారిని జూపును కావ్యరాజముల్
నిర్మలమైన చిత్తమున నీతిని నింపుచు, న్యాయమేదియో
మర్మము దెల్పుచుండి, చెడు మార్గము వీడగజేయుచున్ సదా
శర్మము గూర్చుచున్ ప్రజకు సౌఖ్యము నిచ్చును విశ్వమందునన్.

చ. అశుభము రూపుమాపుచును నంచిత మంగళమబ్బ జేయుచున్
వశ మొనరించు శాంతినిట భవ్యత నింపుచు దివ్య కావ్యముల్
కుశలము గూర్చు నెల్లెడల క్రూరపు భావములెల్ల ద్రుంచుచున్
విశదము సేయు సత్యమును విశ్వము మేలును గోరి నిత్యమున్.

శా. ఖ్యాతిన్ గూర్చును కావ్యముల్ భువినిటన్ గర్వంబు దొల్గించుచున్
జేతుల్ సాచియు విద్యలే యిడి కదున్ జిత్తంబు రంజింపగన్
నీతిన్ నేర్పు జగమ్మునందున బుధోళ్ళీకంబు మెచ్చంగనున్
జ్యోతై వెల్గుచు జ్ఞాన మార్గమున నిల్చున్ విశ్వ సౌభాగ్యమై.

మ. చిరకాలంబుగ వాఙ్మయైక గతియై చిత్రమ్ము భాసిల్లుచున్
స్థిరమౌ జ్ఞానపు సంపదే యొసగుచున్ శ్రేయమ్ము ప్రాప్తించగన్
నెరనమ్మన్ దగు హిత్యమున్ దెలుపుచున్ నిత్యంబు రాజిల్లుచున్
వరమై నిల్చును విశ్వశాంతి కొరకై వాస్తవ్యమౌ నిచ్చలున్

ఉ. కావ్యము దీక్షతో జదువ ఖ్యాతి గుణమ్ములు గల్గ జేయుచున్
దివ్యపు జీవితమ్మొసగి ధీరత గూర్చును మానవాళికిన్
సవ్యపు రీతి నీ జగతి సాగగ జేయగ శాశ్వతమ్ముగన్
నవ్యపు బాటలో నడిపి నమ్మిక నిచ్చును విశ్వశాంతికై

**అన్నపరెడ్డి సత్యనారాయణ రెడ్డి, హైదరాబాద్**

ఉ. కావ్యము నీతి యుక్తమయి క్రమపదమ్ముల పోహళింపుతో
దివ్యపు భావసక్తమయి తీరుగ వెల్గుచు శబ్దశోభతో
భవ్య సమంత ప్రోక్తమయి పాతక కోటికి పద్య రీతిలో
నవ్యపు మార్గ సూక్తమయి నాట్యము చేయు ప్రజాళి నాల్కలన్

శా. ఆశ్వాసమ్ములుగా ప్రకల్పితములై యత్యంత జ్ఞానాప్తియై
శశ్వత్ శోభ నొసంగు కావ్యములె యశ్రాంతమ్ము పృథ్వీస్థలిన్
విశ్వాసమ్మును పెంచుచున్ మనసులో విద్యార్థి కెల్లప్పుడున్
విశ్వజ్ఞాన మొసంగుచుండు సరియౌ విఖ్యాతినే గూర్చుచున్

చ. కనుగొని సృష్టి మూలముల కావ్యములన్ లిఖియించి దీక్షతో
మునివరులాస్థతోడనిల బోధన చేసిరి శిష్య పాళికిన్
పెనుపగు శాస్త్రవిద్యలను ప్రీతిని శోధన చేసి యిచ్చతో
ననువగు భాష, గ్రంథముల నాదటతోడ ప్రజాళి కిచ్చిరే

శా. శ్రేయమ్మున్ ఘటియించ మానవులకున్ చేపట్టి యత్నమ్ములన్
ధ్యేయమ్మున్ మదినుంచి సోధనలపై తీరైన మార్గమ్ములో నా
మ్నాయమ్ముల్ లభియింప చేసిన సువిజ్ఞానంపు సాయమ్ముతో
నాయుర్వేదముతోడ రుగ్మతల వే యంతమ్ము గావించిరే

ఉ. భారత దేశ కావ్యములు భావనచేయ, ప్రపంచ మందునన్
వేరొక మించు గ్రంథమును పేర్కొన జాలము దారి జూపగా
కారణజన్ములౌ బుధులు కాంచిరి జన్మము నీ ధరిత్రిపై
భారతమే యొసంగు నెల్లరకు వైనము సందియముల్ సడల్పగా

**తదుపరి అంశం**

**తొలకరి**

పై అంశానికి 5 పద్యములను 9441039146
ఫోన్ నంబరుకు వాట్సప్ ద్వారా పంపగలరు
ఖండికలు పంపవలసిన ఆఖరు తేది
15 జూన్ 2026

**ప్రహేళికా**

శ్లో: కృతిష్ఠతస్తే పితరౌ తవేతి
అపర్ణయోక్తం పరిహాసపూర్వం ।
కౌవా? మమైవ శ్వశురో తవేతి
తామీరయన్ సుస్మితమీశ్వరో2వ్యాత్ ॥

ఇది పార్వతీపరమేశ్వరుల ప్రణయపరిమళ సంభాషణం. పార్వతీదేవి పరమేశ్వరుని అడిగింది. స్వామీ నాకు తల్లిదండ్రులున్నారు మేనకా హిమవంతులు, మరి మీకున్నారా? తల్లిదండ్రులు లేని అనాథలు కదా! అని పరిహాసమాడిందట. అపుడు పరమేశ్వరుడు అన్నాడు – ఓ దేవీ మనోహరిణీ! నాకు తల్లిదండ్రులు లేరు నిజమే ఒప్పుకుంటున్నా. మరి నాకు అత్తమామలున్నారు. నీకు లేరు కదా! అని అదే వాక్యాన్ని తిరిగి ఆమెను పరిహసించి మందస్మిత సుందరవదనారవిందులైన పార్వతీ పరమేశ్వరులు మనలను రక్షించుగాక! అంటే లోకంలో భార్యాభర్తలన్నాక కోపతాపాలు, పరిహాసాలు, నవరసపూర్వకంగా మనకు ప్రాచీన ఆధునిక కవులు తమతమ ప్రజ్ఞాపాటవాలతో మనకందించారు. వాటిలోని స్వారస్యాన్ని, సాహిత్యాన్ని అర్థం చేసుకుంటే మన జీవితాలు సార్థకమవుతాయి.

**- ముత్యంపేట గౌరీశంకర శర్మ**

# పద్యపరిమళం

## అంత కోపమా! సహజమే కదా!

- మల్లాప్రగడ శ్రీమన్నారాయణ మూర్తి.

“వర్ణనా నిపుణః కవిః” అన్నారు ఆలంకారికులు. వర్ణనా నిపుణత కవికి ఒక ముఖ్య లక్షణం.

మాదయగారి మల్లన “రాజ శేఖర చరిత్ర”లో మొగలితీగ కొసనున్న లేతచిగుళ్ళను వర్ణించాడు.

ఇద్దరు స్నేహితురాళ్ళు పరస్పర సంభాషణ సాగిస్తూ, వన విహారం చేస్తూ మొగలి తీగను చూశారు.

మొగలి తీగ చివరిభాగంలో చిగురాకులు ఎర్రగా ఉన్నాయి.

‘శివుడి చేతి కంకణంగా ఉన్న పాము కోపంతో కాటు వేయటానికి నాలుకను చాచినట్లున్నది’ అని ఒక స్నేహితురాలు అంటోంది.

ఇంతకీ ఆ పాముకు ఎవరిమీద కోపం?

మొగలిపూవు మీద.

ఎందుకు?

శివద్రోహం చేసినందుకు.

మొగలిపూవు చేసిన శివద్రోహం ఏమిటో ఈ కవి ఇక్కడ చెప్పలేదు.

ఒకప్పుడు బ్రహ్మ, విష్ణువు పోటీ పడ్డారు.

జ్యోతిర్లింగ రూపంలో ఆవిర్భవించిన శివుడి తుది మొదళ్ళను కనుక్కోవాలని అనుకున్నారు.

బ్రహ్మ దేవుడు హంసగా మారి శివుడి శిరస్సువైపు ఊర్ధ్వ దిశగా ప్రయాణించాడు. విష్ణుమూర్తి వరాహరూపం ధరించి భూమిని తవ్వుకుంటూ క్రిందికి వెళ్ళాడు. ఆకాశం అంచులు దాటినా, పాతాళం లోతులు చూసినా వారిద్దరికీ శివుడి తుదిమొదళ్ళు తెలియలేదు.

ఆద్యంత రహితుడైన శివుడికి మొదలు ఏదో కనిపెట్టటం తన శక్తికి మించిన పని అని గుర్తించిన విష్ణుమూర్తి తిరిగి వచ్చి తన ఓటమిని ఒప్పుకొన్నాడు.

కాని, బ్రహ్మదేవుడు మాత్రం అలా అనుకోలేదు. తాను పరమశివుడి శిరస్సును చూసి వచ్చానని బొంకాడు. అందుకు ఒక సాక్షిగా మొగలిపూవును తనవెంట తీసుకువచ్చాడు. శివుడికి బ్రహ్మదేవుడిపై ఆగ్రహం కలిగింది. శపించాడు. కూట సాక్ష్యం చెప్పినందుకు మొగలిపూవును కూడ శపించాడు. ఇది శివపురాణ కథ.

ఈ కథ ఆధారంగా ఈ పద్యంలో మొగలిపూవుపై ఆ తీగ చిగుళ్ళకే కోపం వచ్చిందని కవి చమత్కరించాడు. పద్యం చిత్తగించండి.

**అబల! చూడు శివద్రోహి యనుచు కెరలి**
**అతని కంకణ శేషాహి ఆవహించి**
**నాలుకలు కోయుపగిది వనాళి చలిత**
**లాలితైలాలతాగ్ర పల్లవము లమరె.**

ఆ మొగలి పూల తీగ గాలికి కదులుతోంది. ఆ చివరఉన్న చిగుళ్ళు ఎర్రగా ఉన్నాయి. కోపంతో కాటువేయటానికి పడగ ఊపుతూ నాలుకలు చాచిన పాముకోరలులా ఉన్నాయని కవి భావన. ఊహ, చమత్కారం, చిన్న పద్యమైనా ప్రౌఢ పద బంధాలూ ఈ రచనలో ప్రత్యేకతలు.

అవి అలా ఉండగా, ఈ పద్యం మనకు మరో ఆలోచనను కూడ స్ఫురింపచేస్తోంది.

మొగలిపూవును “శివద్రోహి” అనటం విశేషం. పురాణ కథ ప్రకారం ఆ కూట సాక్ష్యం చెప్పిననాటి నుంచి మొగలిపూవుకు “శివద్రోహి” అనే పేరు వచ్చింది.

ఇంతకీ మొగలిపూవు చేసిన ద్రోహం ఏమిటి?

అబద్ధపు సాక్ష్యం చెప్పటం.

అందుకే ఆ పూవు శివుడి కోపానికీ శాపానికీ గురి అయింది. శివ పూజలో వినియోగపడే యోగ్యతను కోల్పోయింది.

అసత్యమే శివద్రోహం. అసత్యం పలికే వాడు శివద్రోహి. అతడి పూజలు పరమ శివుడు అంగీకరించడు. సత్యవాక్కే శివపూజ. అది లోపించిన వేళ శివుడే కాదు, శివుడి చేతి కంకణమైన పాముకూడా అలాంటి శివద్రోహిపై ఆగ్రహిస్తుంది- అనే చక్కని సందేశాన్ని కూడా ఈ పద్యం ద్వారా మనం గ్రహించవచ్చు.

చిన్న పద్యం. పెద్ద సందేశం. దీపం చిన్నదే. దీధితి(కాంతి) గొప్పది.

అవధానపుష్కరిణి అన్ని సంచికలూ ఒకేచోట. ఈ QR కోడ్ స్కాన్ చేస్తే అంతర్జాలంలో ఇప్పటివరకు వచ్చిన అన్ని సంచికలూ ఒకేచోట కనపడు తాయి. అక్కడే చదువుకోవచ్చు లేదా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు

# పద్యపరిమళం

**ఆకృతి రామచంద్ర విరహాకృతి, కన్నెమ తీరు స్వామి చాపాకృతి, కన్నులన్ ప్రభు కృపాకృతి, కైశికమందు రామ దేహాకృతి, సర్వ దేహమునయందున రాఘవ వంశ మౌళి ధర్మాకృతి, కూరుచున్న విధమంతయు స్వామి ప్రతిజ్ఞ యట్లుగాన్**

అశోకవనంలో హనుమకి కనబడిన సీత ఆకృతి రాముణ్ణి స్ఫురింప జేసిందని శ్రీ విశ్వనాథ సత్యనారాయణ వారి అద్భుత కల్పన, వారి 'రామాయణ కల్పవృక్షం' కావ్యంలోనిది. ఆశోకవనంలో శోకముద్రలో సీతాదేవి కూర్చున్న తీరును ఈ పద్యం కళ్ళకు కట్టినట్లు చూపిస్తుంది. ఈ పద్యం గొప్ప ఆధ్యాత్మికత నేపథ్యంగా గలపద్యం. అమ్మ కూర్చున్న తీరు రామచంద్రుని విరహాకృతి. రామచంద్రుని కోసం సీత ఆవేదన జీవుని వేదనగా డా. గరికిపాటి గారు భావిస్తారు. ఇది మామూలు విరహవేదన కాదు. భగవంతుని కోసం భక్తుడు పడే ఆవేదన. జీవుని వేదన సిద్ధాంతం విశ్వనాథ వారి తాత్త్విక దృక్పథం. దీనిని డా. ధూళిపాళ శ్రీరామమూర్తి గారు అద్వైత వేదాంత దర్శనంగా నిరూపించారు.

**'కవి యనగా జీవుని వేదనననుభవించేవాడు. కవితా స్వభావమనగా జీవుని వేదనాభూతి, పరమే శ్వర విషయకమైన నిత్య విరహమే జీవుని వేదన"** ఇదే ఇప్పుడు సీతాదేవి అనుభవదశ.

వీరి వాదనను వీరి తమ్ముడు శ్రీ వేంకటేశ్వర్లు గారు బలపరిచారు. "జీవుని అవిద్యావరణ ఆనందమయకోశాన్ని ఆవరించి ఉంటుంది. సదసత్తులు సర్వత్ర ప్రత్యక్షంగా ఉంటాయి. దానితో పాటు అహమస్మి, దానితో అహంబ్రహ్మాస్మి అనే బ్రహ్మ స్పందం కూడా ఉంటుంది. ఇవి ఒకదానికొకటి ప్రతియోగిత్వాన్ని పొంది ఉంటాయి. అహంబ్రహ్మాస్మి అనే బ్రహ్మ స్పందంయొక్క ఆక్రోశమే జీవుని వేదన" అని వేంకటేశ్వర్లు గారు అభిప్రాయ పడ్డారు. శ్రీ శంకరులు అధ్యాసను పునాదిగా చేసి అద్వైత మహా సౌధాన్ని కట్టినట్లు వేదాంత విచారణలో ఆచార్య పురుషులు విస్పష్టంగా చెప్పని జీవుని వేదనను వైయక్తిక స్థాయి నుంచి విశ్వజనీన స్థాయికి తెచ్చి రామకథ పునాదిగా విశ్వనాథ ఒక మహా సౌధానికి నిర్మించారని డాక్టర్ ముదివేడు ప్రభాకరరావు గారు అభిప్రాయపడ్డారు. విశ్వనాథచెప్పిన జీవుని వేదన జీవ కారుణ్యంగా ఆయన రచనల్లో అంతర్వాహినిగా ప్రవహిస్తూ ఉన్నదని డా. కోవెల సుప్రసన్న గారు నిరూపించారు. ఈ పద్యంలో సరిగ్గా ఆధ్యాత్మిక భావన వెనుక కరుణరసం కనిపిస్తుంది.

**"కన్నెమ తీరు స్వామి చాపాకృతి"**

ఏమిటీ చాపం, కోదండరాముని ధనుస్సు ప్రత్యేకత ఏమిటి? రాముని విలువిద్యారహస్యమేమిటి?

శ్రీరాముడు చైత్రమాసంలో పునర్వసు నక్షత్రంలో జన్మించారు. ఈ నక్షత్రం ఆకాశం లో ధనురాకారంలో దృగ్గోచరమవుతుంది. ఇది ఎక్కుపెట్టిన విల్లులా పంచనక్షత్రాలతో కూడుకున్నది. ధనుస్సులో ఎక్కుపెట్టిన బాణానికి ఏ లక్ష్య శుద్ధి, సిద్ధి ఉన్నాయో దానితో యోగశాస్త్రాంతర్గత కుండలినీ ఊర్ధ్వప్రసరణం గమ్యమాన మౌతుందని సమన్వయం. మహాధానుష్కుడైన శ్రీరాముని విలువిద్యారహస్యం ఈ జన్మనక్షత్ర ఔచిత్యంగా పెద్దలు చెబుతారు.

మస్తకం సహస్రారస్థానం కాగా ధనుస్సుకు యిరువైపులా ఉబ్బెత్తుగా గల భాగాలు కనుబొమలు. దాని క్రింద చక్షువులుండగా లస్తకస్థానం భ్రుకుటి ఆజ్ఞాచక్రమగుచున్నది. వశిష్ఠ, విశ్వామిత్రుల శిష్యునిగా అంతరంగా ఆజ్ఞాచక్రం వరకు రాముడు సాధించిన యోగం సీతాదర్శనంతో వినూత్న శక్తిని పొంది మహాయోగియై శివధనుర్భంగ రూపంలో ఆజ్ఞాచక్రభేధనం సిద్ధించి సీతారామ కళ్యాణానికి దారి తీసింది. శంకర భగవత్పాదులు సౌందర్య లహరిలో "ఓ భగవతీ! కనుబొమల నడుమ నుండు ఆజ్ఞాచక్ర మనస్తత్త్వమును వీడి సుషుమ్న మార్గం ఛేదించి సహస్రారకమలంలో నీ భర్త యగు సదాశివునితో కూడి రహస్యంగా క్రీడించుచున్నావు" సరిగ్గా ఇప్పుడు సీత కూడా ఇలాంటి కోరిక తోనే ఉంది.

కల్పవృక్షం లో శివధనుర్భంగానికి పూర్వమే శ్రీరామ చంద్రుడు సీతను ప్రాగ్దిశా సౌధంబు పై అంతస్తున దర్శించినట్లు చెప్పడం సాభిప్రాయం. విపులార్థవంతం. దేవి సౌదామిని, పై అంతస్తు సహస్రారం. ఇది సీతారాముల రూపంలో లక్ష్మీనారాయణ ద్వంద్వ సమాగమ స్థానం.

"కలాభ్యాం చూడాలంకృత శశి కళాభ్యాం"అని చెప్పిన శ్రీ శంకరుల శివానంద లహరి శ్లోకం ఇక్కడ గుర్తుకువస్తుంది.

ఇవి కేవలం అలంకారికమైన మాటలు కావు. శ్రీశంకరులు ఆజ్ఞాచక్ర, సహస్రార విషయంగా వర్ణించిన పున్నమి నాటి చందమామయే సీతాదేవి ముఖం. ఆ వెన్నెల ఏదో రామచంద్రునికి మాత్రమే తెలుసు. అది ఆధ్యాత్మిక లోకంలో వెన్నెల.

**- 'శతావధాని' చేపూరి శ్రీరామ్**

# సంస్కృతం సంస్కృతి 9

నారుమంచి వేంకట అనంతకృష్ణ శర్మ

నామవాచక శబ్దాల గురించి గత సంచికలలో కొంతవరకు తెలుసుకున్నాము. ఇక ఈ సంచికలో ధాతువులు, వాటి స్వరూపము గురించి తెలుసుకుందాం. ముందు చెప్పుకున్నట్లు సంస్కృతములో పదము కానిది ప్రయోగించరాదు. పదము అంటే అయితే సుబంతములు, లేక తింతములు. సుబంతములను స్థూలముగా నామవాచకములంటే, తింతములను క్రియాపదాలు అందాం. ఈ సంచికలో క్రియాపదములు ఎలా వస్తాయో తెలుసుకుందాం.

యాస్కుని నిరుక్తము ప్రకారము ఎక్కడ నామ, క్రియాపదములు రెండూ ప్రయోగించబడుతాయో అక్కడ క్రియాపదానికే ప్రాధాన్యత, నామవాచకము అప్రాధాన్యము అంటాడు. క్రియాపదమునకు అంత వైశిష్ట్యము ఉన్నది. ఇక సంస్కృతములో క్రియాపదములు ఎలా తయారౌతాయి అన్నది తెలుసుకోవడం చాలా ఉపయుక్తము. పాణిని సుమారుగా 2000+ ధాతువులను చెప్పాడు. వీటిని ఔపదేశిక ధాతువులు అంటారు. ఉదాహరణకి 'భూ' అనే ధాతువుని తీసుకుందాం. 'భూ సత్తాయాం' అని ఉంటుంది. అంటే భూ అనే ధాతువును సత్తా అంటే ఉండుట అన్న అర్థములో వినియోగించాలి. ఈ ధాతువునకు తివీ ప్రత్యయము చేర్చినప్పుడు కొన్ని వ్యాకరణ ప్రక్రియలు జరిగి 'భవతి' అన్న రూపము ఏర్పడుతుంది. భవతి అన్న క్రియాపదము మాత్రమే వాక్యనిర్మాణములో వాడాలి. అలాగే 'ష్ఠా గతి నివృత్తౌ' అంటే ష్ఠా అనే ధాతువు గతి, నివృత్తి అను రెండు అర్థములలో కూడా వినియోగించవచ్చు అని. కొన్ని ధాతువులకు అనేకార్థములలో వినియోగం చెప్పబడినది. ఇలా అన్ని ధాతువులకు ఏ అర్థములో ఆ ధాతువు వస్తుందో చెప్పబడి ఉన్నది. దీనిని ధాతుపాఠము అంటారు. దీనిని నియతముగా కంఠస్థము చేయుట ఒక పద్ధతి. ఈ మధ్యకాలములో సంస్కృతము నేర్పే సంస్థలు, బోధకులు కూడా వీటినుండి ఒక లెక్కప్రకారము నిత్యావసరమునకు ఉపయుక్తములైన 150 – 200 ధాతువులను మాత్రము నేర్చుకున్న చాలు అని వాటిని మాత్రము బోధిస్తున్నారు. సరే అది అట్లుంచండి.

ఈ 2000+ ధాతువులను పది (10) గణములుగా విభజించారు. ధాతువుకు జరిగే మార్పుల ఆధారముగా ఈ విభజన చేసారన్నమాట. అలా ఆయా గణములలో మొదటి ధాతువు ఆధారముగా ఆ గణమునకు పేరు వస్తుంది. ఉదాహరణకు 'భూ' ధాతువుతో ప్రారంభమైన గణమునకు 'భూ ఆది = భ్వాది గణము అంటారు. అలాగే భ్వాది, అదాది, జుహోత్యాది, దివాది, స్వాది, తుదాది, రుధాది, తనాది, క్ర్యాది, చురాది. ఇలా ప్రతి గణములోని ధాతువులకు తివీ ప్రత్యయముతో పాటుగా మరికొన్ని ప్రత్యయములు వచ్చి చేరుతాయి. భూ ధాతువు భవతి ఎలా అయ్యింది అన్న సంశయము రావచ్చు. భూ ధాతువుకు తివీ ప్రత్యయమునకు ముందు శప్ అనే వికరణ ప్రత్యయము కూడా చేరి, సంధిక్రియలు జరిగి భవతి అన్న రూపం ఏర్పడింది. ఇవన్నీ వ్యాకరణము ప్రత్యేకముగా నేర్చుకునేవారికి అవసరము. అవధానులకు ఇవన్నీ తెలియాల్సిన అవసరం లేదు. కానీ ఇవి ఉన్నాయి అన్న అవగాహన ముఖ్యం. అంటే సంస్కృతములో 2000+ క్రియాపదాలు ఉన్నాయి అనుకుంటే పొరపాటు.

గత సంచికలో ధాతువులకు కొన్ని కృత్ ప్రత్యయాలు చేర్చి క్రొత్త నామవాచక పదాలు నిర్మించుకోవచ్చునని చెప్పుకున్నాం. అలాగే కొన్ని ధాతువులకు కొన్ని ప్రత్యయాలు చేర్చుట ద్వారా నూతనమైన ధాతువులను నిర్మించుకోవచ్చు. ఉదాహరణకి పఠ్ అనే ధాతువు తీసుకోండి. చదువుట అని దాని అర్థము. ఈ పఠ్ అనే ధాతువుకు ణిచ్ అనే ప్రత్యయము చేర్చుట ద్వారా పాఠి అనే క్రొత్త ధాతువు వస్తుంది. పాఠి అంటే చదివించుట అని అర్థము. అంటే ధాతువులు ధాతుపాఠములో ఉంటే ఔపదేశిక ధాతువులని, ఇలా ప్రక్రియ ద్వారా నిర్మించుకున్నప్పుడు ఆతిదేశిక ధాతువులని, అలాగే పాణిని వ్యాకరణసూత్రాలలో కొన్ని ధాతువులను స్మరించారు. అంతే కాకుండా నామవాచకపదాలకు కొన్ని కృత్ ప్రత్యయాలు చేర్చుట ద్వారా కూడా నామవాచక పదములనుండి క్రొత్త ధాతువులు నిర్మించవచ్చు. ఇలా ఈ నిర్మాణ ప్రక్రియా విధానము పాణిని అష్టాధ్యాయిలో వివరించబడ్డది. అంటే సంస్కృతాధ్యయనము చేయుట ద్వారా క్రొత్త ధాతువులు, నామవాచకపదములు ఎలా వ్యుత్పత్తి సాధించవచ్చునో నేర్చుకోవచ్చు.

గమనించినట్లైతే సంస్కృతభాషలో నామవాచకము నుండి క్రియాపదములు, క్రియాపదములనుండి నామవాచకములు వ్యుత్పన్నము కావచ్చును. ఉదాహరణకి పచ్ అనే ధాతువు నుండి పచతి అనే క్రియాపదము, పాచకః అన్న నామపదము వచ్చినవి. కృవీ అనే ధాతువునుండి మనం నిత్యం వాడుకునే కర్త, కర్మ, క్రియ, కారణం, కరణం ఇలా పెక్కు పదములు సాధించబడినవి.

'రామః' అన్న పదము గమనించండి. చూడగానే ఇది రాముడు అన్న అర్థము కల సంస్కృత పదము అనుకుంటాము. కానీ పైన చెప్పిన అదాది గణములోని 'రా' అనే ధాతువు యొక్క వర్తమానకాల ఉత్తమపురుష బహువచన రూపము కూడా రామః అనే ఉంటుంది. అలాగే రామ అనే ప్రాతిపదిక ఎలావచ్చింది అంటే 'రము క్రీడాయాం' అన్న ధాతువునకు ఘ్ అన్న కృత్ ప్రత్యయము చేర్చినప్పుడు 'రామ' అన్న ప్రాతిపదిక వచ్చింది. ఇలా అవధానికి ప్రాశ్నికులు ఇచ్చిన పదములనుండి క్రియాపదముగా గానీ దానినే నామవాచకపదముగా కానీ మార్చుకుని పూరణ సాధించేందుకు ఈ విజ్ఞానం చాలా ఉపయుక్తమైయుంటుంది.




2026 మే 5న హైదరాబాద్ రవీంద్రభారతిలో తెలంగాణ ప్రజాకళ 99 రోజుల
సాంస్కృతిక రూపాల ప్రదర్శనలలో భాగంగా జరిగిన **చేపూరి శ్రీరామ్** గారి అష్టావధానం




2026 మే 5న హైదరాబాద్ రవీంద్రభారతిలో తెలంగాణ ప్రజాకళ 99 రోజుల సాంస్కృతిక రూపాల
ప్రదర్శనలలో భాగంగా జరిగిన **ముత్యంపేట గౌరీశంకరశర్మ** గారి అష్టావధానం



ఏలూరు జిల్లా ఆగిరిపల్లివేద సంస్కృత పాఠశాలలో జరిగిన
**డా॥ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్** గారి చతుర్భాషాష్టావధానం

అవధాన విద్యా విజయతే తరామ్



# అవధాన విద్యా వికాస పరిషత్

భాగ్యనగరం

## ప్రకటన

దైవదత్తమైన ప్రతిభకు వ్యుత్పన్నత తోడైతే, లభించిన పాండిత్యాన్ని నిరంతర అభ్యాసంతో పదునుపెడుతుంటే శిలలాంటి వాడైనా శిల్పంగా మారవచ్చు.

## సాధనాత్ సాధ్యతే సర్వమ్

అనే లక్ష్యంతోనే అవధాన విద్యా వికాస పరిషత్ ఆవిర్భవించింది.

తెలుగుభాషకే స్వంతమైన అవధానవిద్యను భావితరాలకు పదిలంగా అందించాలనే సదుద్దేశంతో గత నాలుగు సంవత్సరాలుగా మేము చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలనిస్తుడడం అందరెఱిగిందే. అదే ఒరవడిలో **2026 మే నెల 18వ తేదీనుండి 24 వతేదీ వరకు** ఐదవ శిక్షణ శిబిరాన్ని భాగ్యనగరంలో నిర్వహించ దలచాము.

**వేదిక:** సెయింట్ మార్క్స్ హైస్కూల్, దీనదయాల్ నగర్, నేరేడుమెట్టు, మల్కాజిగిరి, హైదరాబాద్

ఔత్సాహికులు సంసిద్ధులు కండి. మీ సంసిద్ధతను 9441039146 లేదా 9441491900 లేదా 8555082034 నెంబర్‌లకు తెలియజేయండి.

**Published by**
Avadhana Vidya Vikasa Parishat
Sri Rama Sadanam, 29-1499/6/1, Road No.1
West Kakatiya Nagar, Neredmet, Secunderabad - 500056
Ph: 9441039146